TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:`17 ISSUE:4 TUESDAY ,MAY 26,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 17 మంగళవారం 26 మే 2026 పేజీలు :8 వెల: 4/-



## కాక్రోచ్ గ్రూప్‌లో అంతా పాకిస్తానీయులే

హంసకలం వార్త మే 25



కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ప్రారంభించిన ఐదు రోజుల్లోనే రెండు కోట్లకు పైగా ఫాలోవర్లు చేరారు. అయితే, సిజెపి ఫాలోవర్లను ఉద్దేశించి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. వారిని పాకిస్తాన్, జార్జ్ సోరోస్‌కు చెందిన వారుగా పేర్కొన్నారు. దీనిపై అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. సిజెపి ఫాలోవర్లను పాకిస్తాన్ వారిగా చెప్పడాన్ని అభిజీత్ తీవ్రంగా - మిగతా2లో

## పాక్ మధ్య వర్తిత్వం పై భారత్‌కు అభ్యంతరం లేదు

హంసకలం వార్త మే 25



అమెరికా–ఇరాన్ శాంతి చర్చల్లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించడంపై భారత్‌కు ఎలాంటి అభ్యంతరమూ లేదని అగ్రరాజ్య విదేశాంగ మంత్రి మార్కో రుబియో పేర్కొన్నారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారతదేశంలో ఉన్న రుబియో మంగళవారం జరగబోయే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరుకాబోతున్నారు. ఈ నేపథ్యం లో తాజాగా మీడియాతో మాట్లాడిన రుబియో.. భారత్, పాక్ సంబంధాల గురించి స్పందించారు.'భారత్‌కు పాకిస్థాన్ విషయంలో ఉన్న ప్రధాన - మిగతా2లో

# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం



హంసకలం వార్త మే 25

తెలంగాణ ఆడబిడ్డల ఆశీస్సులతోనే ఈ ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ అల్టిమేట్ టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వారు ఆర్థికంగా ఎదిగి ఆదానీ, అంబానీలను మించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో మహిళా సాధికారత, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో ఏకంగా 8,000 స్వయం సహాయక మహిళా సంఘాల భవనాలకు ఒకేసారి శంకుస్థాపన చేశారు. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో మహిళా భవనాలకు పునాది రాళ్లు వేయడం దేశంలోనే ఒక సంచలన నిర్ణయమని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ ఉన్నత స్థాయి వర్చువల్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి - మిగతా2లో

## ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



హంసకలం వార్త మే 25

దేశంలో అన్నిరకాల పంటలను తమ ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వరిధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు సిగ్గులేకుండా బీజేపీ నేతలు బస్సుయాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కనీసం గన్నీ బ్యాగులు తీసుకురాలేని పరిస్దితి ఉందని అన్నారు. కేందప్రభుత్వ దుర్మార్గమైన విధానాల కారణంగానే రైతాంగం కష్టాల్లో ఉన్నారని తెలిపారు. కనీసం డీజిల్ ఇవ్వకపోవటం - మిగతా2లో

## నీట్ ప్రవేశ పరీక్షా పత్రం లీక్ కేసు సుప్రీం ధర్మాసనం అసహనం



హంసకలం వార్త మే 25

దేశవ్యాప్తంగా దుమారం రేపిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్ని ఆదేశాలు జారీ చేసినా.. గత పేపర్ లీక్ ఘటనల నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎలాంటి గుణపాఠాలు - మిగతా2లో


## అట్టహాసంగా పద్మ పురస్కారాలు

హంసకలం వార్త మే 25



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. - మిగతా2లో

## బీఆర్ఎస్‌ను తేలుతో పోల్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



2

- ఆ పార్టీని చెప్పుతో కొట్టి చంపాలని ప్రజలకు పిలుపు
- రైతులను ఆదుకోవడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని విమర్శ
- గోదావరి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీఎంకు బహిరంగ లేఖ

## బతికుంటే సహాయం సున్నా

హంసకలం వార్త మే 25



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో పరిస్థితి చాలా దారుణంగా దిగజారిపోయిందని ఆరోపించారు.ఒక మృతదేహాన్ని కుటుంబ సభ్యులే భుజాలపై మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బతికి ఉన్నప్పుడు సహాయం లేకపోయినా, మరణానంతరం కనీస గౌరవం కూడా దక్కని పరిస్థితికి తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం - మిగతా2లో

## దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

హంసకలం వార్త మే 25



ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు అరిగోస పడుతున్నారని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. యూరియా, సాగునీరు, కరెంట్ సరఫరా, పండిన పంట కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయ్యిందన్నారు. రైతులు ఇంత బాధపడటం మొట్టమొదటి సారి చూస్తున్నామన్నారు సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్లో వరి ధాన్యాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ గతంలో ఈ ప్రభుత్వం ఉన్నా - మిగతా2లో

# కోటి మంది మహిళను కోటీశ్వరులను చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

శ్రీనివాస రెడ్డిలతో పాటు కీలక అధికారులు, మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం రూపొందించిన భారీ రోడ్‌మ్యాప్‌ను ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధి మహిళల పురోగతితోనే ముడిపడి ఉందని నమ్మిన ప్రభుత్వం తమదని సీఎం స్పష్టం చేశారు. సాధారణంగా సోలార్ ఎనర్జీ అంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు గుర్తొస్తారని, కానీ తెలంగాణలో మహిళా సంఘాల ద్వారానే 1,000 మెగావాట్ల సోలార్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని వెల్లడించారు. అలాగే రిలయన్స్ వంటి సంస్థలు చేసే పెట్రోల్ బంక్ వ్యాపారాలను సైతం ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల చేతుల్లో పెట్టబోతున్నామన్నారు. మహిళల వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు వీలుగా బ్యాంక్ లింకేజీ లోన్ల పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించారు. ఇప్పటివరకు రూ.60 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ లోన్లు అందించామని, సున్నా వడ్డీ రుణాల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.1,390 కోట్లు చెల్లించిందని గుర్తు చేశారు. పెద్ద పెద్ద వ్యాపారులు అప్పులు ఎగ్గొట్టి పారిపోతున్న ఈ రోజుల్లో.. మహిళలు మాత్రం తీసుకున్న ప్రతి రూపాయిని నిక్కచ్చిగా చెల్లిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళలు కేవలం చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందుకోసం మండలాల్లో రైస్ మిల్లులు, గోడౌన్లు, ప్లాస్టిక్ పార్కులు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం 100 ఎకరాల వరకు ప్రభుత్వ భూములను కేటాయించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆడబిడ్డలు ప్రతి గింజకూ జవాబుదారీగా ఉంటారని, అందుకే ఇకపై మిల్లులు, గోడౌన్లలో ధాన్యం స్టాక్స్ పెట్టకుండా, మహిళా సంఘాలే నేరుగా వడ్లు కొనుగోలు చేసి బియ్యాన్ని ప్రభుత్వానికి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికోసం సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేస్తామన్నారు. కార్పొరేట్ మార్కెట్ రంగంలోకి మహిళలను తీసుకెళ్లేందుకు 'మహిళా శక్తి సూపర్ బాజార్ల'ను ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం వెల్లడించారు. ఈ సూపర్ బాజార్లలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల్లో వీటి ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను చాలా తక్కువ ధరకే లీజుకు ఇస్తామని చెప్పారు. ఇవి దేశంలోనే బెస్ట్ సూపర్ బాజార్లుగా, డీమార్ట్, బిగ్ బాజార్ల కంటే మిన్నగా క్వాలిటీ వస్తువులతో కస్టమర్లను ఆకట్టుకోవాలని ఆకాంక్షించారు. గత ప్రభుత్వం ఇచ్చిన చీరలు నాణ్యత లేక పంట పొలాల్లో పిట్టలను కొట్టడానికి ఉపయోగపడ్డాయని, కానీ తమ ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ చీరలతో ఆడబిడ్డలు పాలపిట్టల్లా కనిపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. త్వరలోనే పట్టణ ప్రాంతాల్లో కూడా చిలుక పచ్చ రంగులో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. మహిళల అభ్యున్నతిని అడ్డుకోవాలని కొందరు కుట్రలు చేసి, ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ రెచ్చగొట్టినా వెనక్కి తగ్గలేదన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ.10 వేల కోట్లను ప్రభుత్వమే సంస్థకు చెల్లించిందని స్పష్టం చేశారు. మహిళలను బస్సులకు యజమానులను చేయాలనే లక్ష్యంతో 1,000 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగానే జూన్ 5న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా 553 బస్సులను ప్రారంభించబోతున్నామని సీఎం వివరించారు. ఇదే సమయంలో సొంత చెల్లెళ్లను ఇళ్ల నుంచి వెళ్లగొడుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఆయన పరోక్షంగా స్పందిస్తూ, బయటకు వెళ్లగొట్టబడిన చెల్లెలు ఎలా శాపనార్థాలు పెడుతుందో అందరం చూస్తున్నామన్నారు.

# ఇప్పటికే 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

-మొదటిపేజీ తరువాయి

ఎక్కడికక్కడా ధాన్యం రవాణా ఆగిపోయిందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ధ్వజమెత్తారు. అటు సాగర్ ఆయకట్టు.. ఇటు సీతారామ ఆయకట్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కృష్ణా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పలు సంస్థలను నిర్వీర్యం చేశారని ఫైర్ అయ్యారు. తెలంగాణలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని.. ఇంకా కొంటామని స్పష్టం చేశారు. సోమవారం యాతాలకుంట టన్నెల్‌ను మంత్రి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్ వద్ద అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందాలనేది తన చిరకాల వాంఛ అని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం ఎక్కువ అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు గోదావరి ఆయకట్టు దక్కలేదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చివరి ప్రాంతమైన ఖమ్మానికి గోదావరి జలాలు అందలేదని ప్రస్తావించారు. ఎక్కువ భూభాగం ఎన్నెస్పీ కెనాల్ పైభాగం.. కింద భాగంలో గోదావరి ఉండటంతో నీరు అందలేదని అన్నారు. తాను తెలుగుదేశం పార్టీలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసి.. అప్పటి ముఖ్యమంత్రిని.. ఖమ్మానికి గోదావరి జలాలు అందించాలని కోరానని ప్రస్తావించారు. నల్గొండ పీడిత ప్రాంతానికి మాజీ సీఎం ఎన్టీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవకాశం ఇచ్చారని తెలిపారు. గోదావరిపై మొట్టమొదట దేవాదుల ప్రారంభించామని చెప్పుకొచ్చారు. గోదావరిపై ఎత్తిపోతల పథకాలకు తప్ప మరో అవకాశం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. గోదావరిపై 1998లో దుమ్ముగూడెం ప్రతిపాదన తీసుకువచ్చామని వివరించారు. ఆనాడు దుమ్ముగూడెం వద్ద రాజీవ్ సాగర్ – ఇందిరా సాగర్ వరకు ప్రారంభించిన పంపులు మోటార్లకే పరిమితమయ్యాయని అన్నారు. దుమ్ముగూడెం శ్రీరామ చంద్రుడు నడయాడిన ప్రాతంలో సీతారామ ప్రారంభించామని చెప్పుకొచ్చారు. ఆ ప్రభుత్వంలో కేవలం పంప్‌హౌస్ నిర్మాణ పనులకే పరిమితమయ్యాయని అన్నారు. యాతాలకుంట టన్నెల్ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు నీరు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఈ టన్నెల్ పూర్తి చేయడానికి కూడా నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల అన్నారు. ఇది తన జీవిత ఆశయమని.. లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పానని ప్రస్తావించారు. రేవంత్‌రెడ్డి మొదటిసారి రాజీవ్ లింక్ కెనాల్‌కు అనుమతి ఇచ్చారని అన్నారు. ఆరునెలల్లో రాజీవ్ లింక్ కెనాల్ పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాతాలకుంట టన్నెల్‌కు అనుమతి ఇచ్చారని వెల్లడించారు. 15 నెలల్లో రెండు కిలోమీటర్ల పొడవు టన్నెల్ నిర్మాణం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు చేపట్టిన ఏజెన్సీ, అధికారులను మంత్రి తుమ్మల అభినందించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని.. ఇది తన రాజకీయ కోరిక అని వ్యాఖ్యానించారు. తనను ఆశీర్వదించిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నదే తన ఆశయమని ఉద్ఘాటించారు. ఆగష్టు 15వ తేదీలోగా లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. 35 సంవత్సరాల క్రితమే డొక్కా సీతమ్మ ఆక్విడెక్ట్ కట్టామని ప్రస్తావించారు. రైతుల త్యాగానికి ఫలితంగా నష్టపరిహారం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించానని తెలిపారు.

# దుర్భర పరిస్థితుల్లో తెలంగాణ రైతులు

-మొదటిపేజీ తరువాయి

'ఉత్తమ్ నీది నోరా మోరా.. మొన్న 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అని చెప్పి ఇప్పుడు 70 లక్షల మెట్రిక్ టన్నులు కొంటాం అనడం ఎంతవరకు సబబు' అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం కాదని.. కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కోటి మెట్రిక్ టన్నుల ధాన్యంలో 70 లక్షలు కొంటే మిగతా ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలని మాజీ మంత్రి ప్రశ్నించారు. తాలు పెడితే తోలు తీస్తా అని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నారని.. సిద్దిపేట నియోజకవర్గంలో క్వింటాల్‌కు 5 కిలోలు తరుగు తీస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని విమర్శించారు. రోహిణి కార్తె వచ్చినా కళ్లాల్లోనే ధాన్యం, రైతులు ఉన్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటిదాకా ప్రభుత్వం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నదని తెలిపారు. రైతులు గుండెలు బాదుకుంటున్నా ఈ ప్రభుత్వానికి కళ్లు కనబడటం లేదంటూ విమర్శలు గుప్పించారు. వరి కుప్పలపైనే రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు వదిలారని హరీశ్ రావు తెలిపారు. 'మిషన్ మోడ్‌లో వడ్లు కొనాలని రేవంత్ అంటున్నారు. నీది మిషన్ మోడ్ కాదు.. కమిషన్ మోడ్. నిన్న కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులకు ఆదేశాలు ఇస్తారని రైతులు ఆశించారు. రైతుల ఆశలు నిరాశ అయ్యాయి. 45 రోజుల్లో మొత్తం రైతుబంధు వేస్తానని చెప్పి 60 రోజులు గడిచినా వేయలేదు. రేవంత్ రెడ్డి కేవలం పేపర్ టైగర్ మాత్రమే... దేవుని మీద ఒట్టు పెట్టి మాట తప్పిన రకం నువ్వు. ఢిల్లీ ట్రిప్పులు మాని.. లారీల ట్రిప్పులు పెంచు. ఒకటి, రెండు రోజుల్లో మార్పు రాకుండే స్వయంగా నేనే కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నా చేపడతా. వేలాది మంది రైతులతో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌లను దిగ్బంధిస్తాం. రాజకీయ విమర్శలు మాని పరిష్కార మార్గాలు చూడండి' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# బతికుంటే సహాయం సున్నా

-మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు సామాజిక మాధ్యమ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఓ పోస్టు పెట్టారు. పేదల అంతిమయాత్ర కూడా గౌరవప్రదంగా సాగాలని కేసీఆర్ హయాంలో భావించి, మృతదేహాల తరలింపునకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశాయమని కేటీఆర్ గుర్తుచేశారు. అదే మానవత్వం, అదే ప్రజల గౌరవాన్ని కాపాడే పాలన అని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని.. ప్రజలకు అవసరమైన కనీస వసతులను అందించడంలో ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. పోస్టర్లు, సభలు, పర్యటనలు, హెలికాప్టర్ల కోసం ప్రజల డబ్బును ఖర్చు చేస్తున్నారని, కానీ పేదలకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆగ్రహించారు. రాజకీయ కక్షసాధింపులు, విమర్శలు, ప్రచార హోరులోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిమగ్నమైందని విమర్శించారు. ప్రజల కష్టాలు, సమస్యలు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో పాలన సాగిందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన మార్పు ఇదేనా..? అని ప్రశ్నించారు. తెలంగాణ గౌరవాన్ని వీధుల్లోకి లాగడానికే ప్రజలు ఈ ప్రభుత్వానికి అధికారం ఇచ్చారా..? అని నిలదీశారు. నాయకుల పాదయాత్రలకు విలాసవంతమైన బస్సులు, ప్రచారాలకు ప్రభుత్వ వనరులు ఉపయోగించే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, పేదల అంతిమయాత్రకు కనీస గౌరవం ఇవ్వకపోవడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటన కేవలం ఒక కుటుంబం విషాదం మాత్రమే కాదని, తెలంగాణ సమాజాన్ని కుదిపేస్తున్న పరిస్థితికి నిదర్శనమని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఓ కుటుంబం తమ బంధువు మృతదేహాన్ని భుజాలపై మోసు కెళ్లాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కండె వెంకన్న (42) వడదెబ్బతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృత దేహాన్ని మార్చురీకి తరలించారు. తర్వాత మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేం దుకు కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రైవేటు వాహనం ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆస్పత్రి అధికారులు మార్చురీ వ్యాన్ ఏర్పాటు చేయాలని పలుమార్లు వేడుకున్నారు.

## కాక్రోచ్ గ్రూప్‌లో అంతా పాకిస్తానీయులే

-మొదటిపేజీ తరువాయి

ఖండించారు. తన ఖాతా హ్యాక్ కావడానికి ముందు ఫాలోవర్ల భౌగోళిక వివరాలకు సంబంధించిన సమాచారాన్ని సోషల్ మీడియాలో వెల్లడించారు. అందుకు సంబంధించిన స్క్రీన్ రికార్డింగ్‌ను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఆ వివరాల ప్రకారం, 94 శాతానికి పైగా ఫాలోవర్లు భారతదేశానికి చెందినవారేనని అభిజీత్ తెలిపారు. భారత యువతను పాకిస్తానీయులుగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎందుకు ముద్ర వేస్తున్నారని అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. దీనికి స్పందిస్తూ కేంద్ర మంత్రి రిజిజు మరో పోస్టు చేశారు. 'పాకిస్తాన్, జార్జ్ సోరోస్ వర్గాల నుంచి సోషల్ మీడియాలో ఫాలోవర్లను సంపాదించుకోవాలనుకునే వారిపై నాకు జాలి వేస్తోంది. భారతదేశంలో తగినంత జనాభా, 'అత్యంత చురుకైన యువత ఉన్నారు. వారు నిజమైన, విలువైన అనుచరులుగా ఉండగలరు. గుర్తింపు కోసం దేశ వ్యతిరేక శక్తులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు' అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కాగా, ప్రస్తుతం భారత్‌లో కాక్రోచ్ జనతా పార్టీకి సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాలు నిలిపేశారు.

## పాక్ మధ్య వర్తిత్వం పై భారత్‌కు అభ్యంతరం లేదు

-మొదటిపేజీ తరువాయి

ఆందోళనలు ఉగ్రవాద సంస్థల గురించే. వాటికి ఇరాన్ చర్చల్లో పాకిస్థాన్ పాత్రతో సంబంధం లేదు. పాక్ భూభాగం నుంచి పనిచేస్తూ భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుంటున్న సాయుధ ఉగ్రవాద బృందాల గురించే ఇండియన్లు ఎక్కువగా మాట్లాడతారు. వారు దాని గురించే ఎప్పుడూ ఆందోళన చెందుతూ ఉంటారు. కానీ ఇరాన్ విషయంలో మధ్యవర్తిత్వం గురించి ప్రస్తావన రాలేదు. దాని గురించి వారు ఫిర్యాదు చేస్తారని నేను అనుకోను' అని రుబియో పేర్కొన్నారు. భారతదేశం అమెరికాకు అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామి అని, ప్రముఖ వాణిజ్య భాగస్వామి అని రుబియో అభివర్ణించారు. 'ఈ బంధం బలంగా కొనసాగుతుందని నేను భావిస్తున్నాను. ప్రస్తుత అమెరికా పరిపాలన ముగిసేనాటికి రెండు దేశాల మధ్య బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ఉంటుందని నేను నమ్ముతున్నాను' అని రుబియో అన్నారు.

## నీట్ ప్రవేశ పరీక్షా పత్రం లీక్ కేసు

-మొదటిపేజీ తరువాయి

నేర్చుకోలేదని అత్యున్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. ఈ వ్యవహారంపై ఎన్‌టీఏతో పాటు కేంద్రం, సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది మే 3వ తేదీన దేశవ్యాప్తంగా జరిగిన నీట్ యూజీ 2026 పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం లీకవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అంతకుముందు 2024లోనూ ఈ పరీక్ష పేపర్ లీక్ చోటు చేసుకుంది. దీంతో ఏటా ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోన్న ఎన్‌టీఏపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వైద్య విద్య ప్రవేశపరీక్ష నిర్వహణ కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి బదులుగా ఓ స్వతంత్ర సంస్థను ఏర్పాటుచేయాలని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం విచారణ జరిపిన న్యాయస్థానం.. ఎన్‌టీఏ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఎన్‌టీఏ తమ వైఫల్యాల నుంచి ఎలాంటి పాఠాలు నేర్చుకోక పోవడం విచారకరం. ఈ అంశం గతంలోనూ సుప్రీంకోర్టును చేరింది. అప్పుడు మానిటరింగ్ కమిటీని ఏర్పాటుచేశాం. ఆ కమిటీ కొన్ని ప్రతిపాదనలు చేయగా.. వాటిని ఎన్‌టీఏ అంగీకరించింది. దీంతో పాటు ఈ పిటిషన్‌పై తమ స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, సీబీఐకి కూడా సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## అట్టహాసంగా పద్మ పురస్కారాలు

-మొదటిపేజీ తరువాయి

ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీల కు ఎంపికయ్యారు. తొలుత సోమవారం 60 మందికి ఈ పురస్కారాలు అందచేశారు. కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వ కారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్‌ను తేలుతో పోల్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీ విధానాలు వెనక నుంచి కాటు వేసే తేలు లాంటివని, అలాంటి పార్టీని చెప్పుతో కొట్టి చంపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శకం ముగిసిందని, ఆ పార్టీ కేవలం కొన్ని మీడియా, సోషల్ మీడియాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. 'సారు.. కారు.. 16' అని ప్రచారం చేసుకున్న బీఆర్ఎస్.. లోక్‌సభ ఎన్నికల్లో కనీసం ఒక్క ఎంపీ స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయిందని రాంచందర్‌రావు విమర్శించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాని మోదీ వద్దకు వంద సార్లు వెళ్లి నిధులు తెచ్చుకుంటూ, బయట మాత్రం కేంద్రం సహకరించడం లేదని అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ కూడా ఇదే విధంగా వ్యవహరించి ప్రజలతో తిరస్కారానికి గురయ్యారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికొదిలేసిందని రాంచందర్‌రావు మండిపడ్డారు.

# సంపాదకీయం

## కర్ణుడి విషాదాంతం తరతరాల పద్య కవిత్వం

నిత్యజీవితంలో ఓటమికీ, పతనానికీ, విషాదాంతానికీ కారణాలు చెప్పాల్సివస్తే... కర్ణుడితో పోలిక తేవడం మన తెలుగువారి అలవాటు. సంభాషణల్లో, ప్రసంగాల్లో, రాతల్లో, సాహితీ చర్చల్లో ఇది తరచూ జరిగేదే. విషయాన్ని బలంగా, మనసుకు హత్తుకునేలా చేయగల ప్రతీక ఇది. 'కర్ణుడి చావుకు వేయి కారణాలన్నట్టు..' అంటూ చెప్పేవాళ్లున్నారు. ఆ కారణాలు వంద అనీ, (సవా)లక్ష అనీ కొందరంటుంటారు. ఇంకొంతమందైతే 'కోటి కారణాల'ని చెప్తుంటారు. ఆ లెక్క ఏమిటో తేల్చకుండా 'కర్ణుడి చావుకు కారణాలెన్నో అన్నట్టు' అంటూ గడుసుగా పోల్చేవాళ్లూ కనిపిస్తారు. ఇక్కడ వారు చెప్పే సంఖ్యకు ప్రాధాన్యం లేదనీ, 'లెక్కలేనన్ని కారణాలు' అనేది వారి భావమనీ తెలుస్తూనే ఉంటుంది. ఇంతకీ కర్ణ కథ ఉన్న 'మహాభారతం' కర్ణ వధకు కారకులు ఎందరని చెప్తోంది? దీంతోపాటు జనశ్రుతిలో ఉన్న, బహుళ ప్రాచుర్యం పొందిన చాటువు విశేషాలేమిటి 'కర్ణుడు లేని భారతం శొంఠి లేని కషాయం', 'కర్ణునితో భారతం సరి.. కార్తీక మాసంతో వానలు సరి ఇలాంటి సామెతలూ, నానుడులూ ఈ ఇతిహాసంలో కర్ణుడి పాత్ర ప్రాముఖ్యం ఎంతటిదో చెప్తున్నాయి. జననం, మరణం.. ఈ రెండూ మాత్రమే కాకుండా జీవిత పర్యంతం కర్ణుడి ప్రస్థానం విషాదభరితం. చేసిన దానం, ఇచ్చిన వరం, నిందలూ, శాపాలూ, అవమానాలూ... ఇవన్నీ అతడి పతనానికి దారులు పరిచాయి. వేల ఏళ్ల క్రితం వేద వ్యాసుడు సంస్కృతంలో రాసిన మహాభారతం శాంతిపర్వం ఐదో అధ్యాయంలో

-బ్రాహ్మణస్యాపి శాపేన రామస్య చ మహాత్మనః

-కుంత్యాశ్చ వరదానేన మాయయా చ శతక్రతోః

-భీష్మావమానాత్సంఖ్యాయాం రథానామర్ధకీర్తనాత్

-శల్యాత్తేజో వధాచ్చాపి వాసుదేవనయేనచ

అంటూ నారదుడు చెప్పిన విషయం శ్లోక రూపంలో ఉంది. దీని ప్రకారం-- కర్ణుని మరణానికి ఏడు హేతువులు. బ్రాహ్మణ శాపం, పరశురాముని శాపం, కుంతీదేవి పొందిన వరం, ఇంద్రుడి మాయ, భీష్ముడి అవమానం, శల్యుడి హేళన, కృష్ణుడి వ్యూహం. ఇంతకీ చంపినవాడు ఫల్గుణుడు కదా? అతడి ఊసేదీ? అందరికీ తెలిసిన సత్యమే కాబట్టి వేదవ్యాసుడు నారదుడితో అర్జునుడి పేరును ప్రత్యేకంగా చెప్పించి వుండకపోవచ్చు

ఇదే శ్లోకాన్ని 13వ శతాబ్దిలో 'శ్రీమదాంధ్ర మహాభారతం'లో తిక్కన ఇలా అనువదించాడు-- (శాంతిపర్వ ప్రథమాశ్వాసంలోని 35వ చంపకమాల పద్యం)

-వినుము నరేంద్ర! విప్రుడలివెన్, జమదగ్నిసుతుండు శాపమి

-చ్చె, నమరభర్త వంచనము చేసె, వరంబని కోరి కుంతి మా

-న్చెనలుక, భీష్ముదర్ధరథు జేసి యడంచె గలంచె మద్రరా

-జనుచితమాడి, శౌరి విధియయ్యె, నరుండటు జంపె గర్ణునిన్'

('ధర్మరాజా! నేను చెప్పేది విను. బ్రాహ్మణుడు కోపగించి యుద్ధంలో రథచక్రం భూమిలోకి కుంగిపోతుందని శపించాడు. తర్వాత పరశురాముడు తాను నేర్పిన దివ్యాస్త్రాలు అవసరమైనపుడు పనిచేయబోవని శాపం పెట్టాడు. ఇంద్రుడు మోసం చేసి సహజ కవచ కుండలాలను గ్రహించాడు. కుంతి వరమనే నెపంతో కోరి అతడి కోపాన్ని మాన్పింది. భీష్ముడు కర్ణుడిని అర్ధరథుడిగా చేసి అగౌరవపరిచాడు. శల్యుడు అనుచిత వాక్కులతో హృదయాన్ని కలతపెట్టాడు. కృష్ణుడు అతడికి దాటరాని విధిగా నిలిచాడు. ఇన్ని జరగ్గా అర్జునుడు కర్ణుడిని రణరంగంలో వధించగలిగాడు. తెలుగు భారతంలో 'నరుండటు జంపె గర్ణునిన్' అంటూ తిక్కన అర్జునుడినీ చేర్చి లోటు తీర్చాడు! ఇలా తెలుగు భారతం ప్రకారం.. ఎనిమిది మంది కారకులు. ఈ జాబితాలో ఉన్న బ్రాహ్మణుడినీ, భీష్ముడినీ, శల్యుడినీ తీసివేస్తే ఐదుగురు. వారికి ధర (భూదేవి)ను కలిపి ఆ ఆరుగురే కర్ణుడి చావుకు కారకులంటూ... అర్జునునికి కృష్ణుడే చెప్పినట్టు ప్రచారంలోకి వచ్చిందో కంద పద్యం.

-నరవర! నీచే నాచే

-వరమడిగిన కుంతి చేత వాసవు చేతన్

-ధరచే భార్గవు చేతన్

-అరయంగా కర్ణుడీల్గె నార్గుర చేతన్'

ఈ చాటుపద్య సృష్టికర్త ఎవరో ఎవరికీ తెలియదు. కవిత్వ సంపద లేకపోవచ్చు కానీ.. సూటిగా తేటగా చెప్పిన పద్యమిది అని పండితుల ఉద్దేశం. ఈ చాటువుకు మూలం ఏమై వుంటుంది? భారతానికి అనుబంధంగా 'భారత సార సంగ్రహం'గా పేరుకెక్కిన చిన్న పుస్తకం 'భారత సావిత్రి'. 17వ శతాబ్దికి చెందిన నీలకంఠ చతుర్ధర మహాభారత వ్యాఖ్యానాన్ని పరిష్కరించి మహారాష్ట్ర పండితుడు రామచంద్రశాస్త్రి కింజ్ వాడేకర్ 1936లో దీన్ని ప్రచురించారు. దీనిలో ప్రక్షిప్తాలు (కవి రాసిన గ్రంథంలో తర్వాతి కాలం కవులు చేర్చిన భాగాలు) ఉన్నాయనే వాదన ఉంది. దానిలోదే ఈ శ్లోకంత్వ(యా) మయా చ కుంత్యాచ ధరణ్యా వాసవేన జామదగ్న్యేన రామేణ షడ్భిః కర్ణో నిపాతితఃఃదీన్ని దాదాపు యథాతథంగా తెలుగు చాటువుగా మలిచారని ఊహించవచ్చు. అయితే, 1936కి ముందే తెలుగు చాటువు ప్రాచుర్యంలో ఉంది. అంటే అంతకు పూర్వం ఉన్న ఏదో ఒక ప్రచురణలోని ఇదే శ్లోకం ఆధారంతో చాటువు పుట్టి వుంటుంది. ('కర్ణ, శాంతి పర్వాల' తిక్కన భారత ఆంధ్రీకరణ 13వ శతాబ్దిలోనే పూర్తయింది 'ధరణి శాపం' భారతంలో ఎక్కడా లేదు. ఒకప్పుడు గురువాజ్ఞతో కర్ణుడు నేతిని పాత్రలో తెస్తుండగా అది జారి భూమ్మీద పడి ఒలికిపోయింది. మళ్లీ నేతిని తేవడానికి వెళ్తే సమయం మించిపోయి గురువు కోపగిస్తాడనే భయంతో అక్కడినేలను బలంగా పిండి, నేతిని పాత్రలోకి నింపుకుంటాడు. తనను నిర్దయగా బాధపెట్టాడని కోపించిన భూదేవి యుద్ధసమయంలో అతడి రథచక్రం తనలో కుంగిపోతుందంటూ కర్ణుడికి శాపమిస్తుంది. లోకంలో ప్రసిద్ధంగా ఉన్న ఈ కథ ప్రస్తావనే చాటువులోనూ, శ్లోకంలోనూ చేరింది. ఈ చాటువుకు పాఠ భేదాలు కూడా కనిపిస్తాయి.


-నరు చేతను నా చేతను

-వరమడిగిన కుంతిచేత వాసవుచేతన్

-ధర చేత శల్యుచేతను

అరయంగా గర్ణుడీల్గె నార్వుర చేతన్'ఇలా పరశురాముడి స్థానంలో శల్యుడిని జోడించడం కొన్నిచోట్ల కనిపిస్తుంది. "నీ చేతను నా చేతను" అంటూ తొలి పాదం.. ఛందోబద్ధం కానప్పటికీ లోకుల నోట నానటం ఓ విశేషం. వేటూరి ప్రభాకరశాస్త్రి సేకరించి సంకలనం చేసిన 'చాటుపద్య మణిమంజరి' రెండు భాగాల్లోనూ (1913, 1922), దీపాల పిచ్చయ్యశాస్త్రి రూపొందించిన 'చాటు పద్య రత్నాకరము' (1917)లోనూ ఈ చాటువు చోటుచేసుకోలేదు. కానీ ఆ కాలానికే ఈ చాటు పద్యం ప్రాచుర్యంలో ఉంది. ఈ చాటువును మూడు తెలుగు పుస్తకాల్లో ప్రముఖంగా ప్రస్తావించారు: 1917లో రాసి 1928లో వజఝల చినసీతారామశాస్త్రి వచన రచన 'కర్ణ చరిత్ర', 1929లో సోమరాజు రామానుజరావు రచించిన నాటకం 'దానవీర కర్ణ', 1935లో మ. శ్రీరామమూర్తి ఇదే పేరుతో రాసిన మరో నాటకం. 1927--28లో గుర్రం జాషువ రచించిన 'భారత వీరుడు' పద్యాలు 'భారతి'లో వెలువడ్డాయి. అంటే దాదాపు వందేళ్ల క్రితం! అందులో కర్ణుడిని శ్లాఘిస్తూ-- అన్యాయంగా వధించారని బాధపడుతూ అతడిని ఓదారుస్తూ రాశారు కవి.

# తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వేడి



గత వారం రోజులలోనూ తెలుగు రాష్ట్రాల రాజకీయాలలో వివాదాలు, విద్వేష దూషణలూ పరాకాష్టకు చేరాయి. అధికారంలో వున్న కోల్పోయిన పాలక పార్టీల కీలక నేతలు మాజీ ప్రస్తుత ముఖ్యమంత్రులేగాక కేంద్రంలో పాలిస్తున్న బిజెపి-ఎన్‌డిఎ మంత్రులు కూడా ఈ వివాదాలకు ప్రత్యక్ష పరోక్ష కారకులు కావడం విశేషం. ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్‌లో సభకు హాజరై ఎ.పి ముఖ్యమంత్రినీ ఉపముఖ్యమంత్రినీ కలిసి వెళ్లిన వెనువెంటనే ఈ పరిస్థితి రావడం యాదృచ్ఛికం కాదు. ఈ వివాదాలలో బయటి పరిణామాలు మాత్రమేగాక పాలక పార్టీలు అంతర్గతంగానూ మల్లగుల్లాలు పడవలసిన పరిస్థితి మరింత ప్రాధాన్యత కలిగింది. ఈ క్రమంలో పదవులు, ఉద్వాసనలూ, పొత్తులూ, ఎత్తులూ అన్నిటిపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. వేల కోట్ల రూపాయల విలువైన ప్రజా ధనంతో నడిచే నిర్మాణాలూ, ప్రాజెక్టులూ, కేటాయింపులు కూడా సందేహాలకు గురవుతున్నాయి. ప్రస్తుత మీడియా స్వభావరీత్యానే ఈ విధమైన మౌలిక సమస్యలు వదిలేసి పరస్పర వివాదాలు, పార్టీల తగాదాలకు పెద్ద పీట వేస్తుంటే నిజమైన సమస్యలపై కేంద్రీకరణ, ప్రజల ఆస్తుల రక్షణ, ప్రజాస్వామ్య లౌకిక విలువల పరిరక్షణ వంటి అంశాలు వెనక్కు పోతున్నాయి.

**-బి.జె.పి ఇరకాటం, బి.ఆర్.ఎస్ దాడి**

ప్రధానమంత్రి సభ నాటికే కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసుపై తెలంగాణ రగిలిపోతున్నది. చాలా కాలం కిందటే బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు త్వరితంగా రంగంలోకి దిగలేదు. పైగా సదరు మంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాని పాల్గొన్న సభలలోనే పాల్గొనగలిగారు. ప్రధాని పర్యటన సందర్భంగా బిజెపి సభలోనైతే సంజయ్ మాట్లాడుతూ తన కుటుంబంపై కుట్రలు జరుగుతున్నాయని ఎదురు దాడి కూడా చేశారు. అప్పటికే పోక్సో కేసుపై అలజడి పెరగడంతో రేవంత్ రెడ్డి పోలీసులకు ఆదేశాలిచ్చినట్టు వార్త ప్రసారమైంది. ప్రధాని పర్యటన భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమైన కారణంగా ఈ కేసుపై దృష్టి పెట్టలేకపోయామని డిజిపి వివరణ ఇచ్చారు. అయితే తర్వాత కూడా రెండు మూడు రోజుల దాకా ఏ చర్య లేదు సరికదా కేంద్రమంత్రి 'ఏక్తా యాత్ర' అంటూ జరిపి అక్కడ 'జై శ్రీరాం' నినాదాల మధ్య తనను తాను సమర్థించుకుంటూ విమర్శకులకు హెచ్చరికలు చేశారు. భక్తి పేరిట జరిపిన యాత్రలో పోక్సో కేసు సమర్థనలతో మాట్లాడటం బిజెపి అభిమానులే జీర్ణించుకోలేకపోయిన పరిస్థితి, ఇదే సమయంలో అతన్ని ముఖ్యమంత్రి ఇంట్లోనే దాచి వుంచారని బి.ఆర్.ఎస్ నాయకులొకరు ఆందోళన చేయబోయి అరెస్టయ్యారు. ఈ ఘటనలో బాధితురాలు మైనర్ కాదంటూ విపరీతంగా పోస్టులు, ట్రోల్స్ గుప్పించారు. కొందరు మహిళా యూ ట్యూబర్లతో సహా సోషల్ మీడియా, కొన్ని ఛానళ్లు బండిని వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశాయి. కె.సి.ఆర్ కుటుంబానికి బండి సంజయ్‌కి కూడా స్వంత జిల్లా అయిన కరీంనగర్‌లో దీనిపై రెండు పార్టీల మధ్య తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. చివరకు హైకోర్టు బెయిల్ నిరాకరించాకగానీ భగీరథ్ అరెస్టు కాలేదు. భగీరథ్‌ను అరెస్టు చేశామని పోలీసులు చెబుతుంటే తానే అప్పగించానని సంజయ్ చెప్పుకున్నారు. చివరకు ముఖ్యమంత్రి కూడా దీన్ని ఖండించవలసి వచ్చింది. అయితే మైనర్ బాలికకు సంబంధించిన విషయంలో తాము జాగ్రత్త తీసుకుంటే బి.ఆర్.ఎస్ మాత్రం ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించనట్టు రాజకీయ స్వార్థంతో దాడి చేస్తున్నదని కూడా ముఖ్యమంత్రి విమర్శించారు. బిజెపితో బి.ఆర్.ఎస్ కే సంబంధాలున్నాయని, అందుకే కాళేశ్వరం తప్పులపై ఎలాంటి చర్యకు సిద్ధం కాలేదని కాంగ్రెస్ ఆరోపణ, కాంగ్రెస్ కావాలనే కె.సి.ఆర్ పై తీవ్రమైన ఆరోపణలను పక్కనపెట్టి వేరే వాటిపై విచారణ తతంగాలు జరుపుతున్నదని బిజెపి ఎదురు దాడి. ప్రధాని పర్యటనలో ముఖ్యమంత్రిని మాతో కలవండని పిలుపునివ్వడంపైనా చాలా చర్చలు నడిచాయి. బి.ఆర్.ఎస్ తీవ్రమైన కుమ్మక్కు ఆరోపణలు చేస్తుంటే ముఖ్యమంత్రి తేలిగ్గా తోసిపుచ్చారు. మొన్నటి దఫా ఎన్నికల తర్వాత తెలంగాణ తమ టార్గెట్ అంటూ హడావుడి చేస్తున్న బిజెపికి బండి సంజరు వివాదం నష్టదాయకమని ఆయనను పదవి నుంచి తప్పించాలని ఆ పార్టీలోనే ముసలం పుట్టిన సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తప్ప ప్రముఖ నేతలెవరూ దీనిపై పెద్దగా స్పందించడం లేదు.

**-రేవంత్ వ్యూహాలు**

బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి గతంలో చేసినట్టు రేవంత్ రెడ్డి తమ పార్టీ నేతలతో టచ్‌లో వుండొచ్చని ఆ పార్టీ ఎంపి ధర్మపురి అర్వింద్ సెలవిచ్చారు. బి.ఆర్.ఎస్ ఎ.పి లో వైసిపి నేత జగన్‌తో కలసి పని చేస్తున్నదని ఒకవైపు, రేవంత్ రెడ్డి గత సంబంధాలను బట్టి చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మరోవైపు కథనాలు సాగుతూనే వున్నాయి. బి.జె.పి-ఆర్.ఎస్.ఎస్ ల మత రాజకీయాలు, ఇటీవల కాంగ్రెస్‌కు మళ్లీ చేరువైన మజ్లిస్ నేతల మత పాచికలు తరచూ ప్రభావం చూపిస్తున్నాయి. వీటన్నిటి మధ్యనా కార్మికుల పోరాటాలు, విద్యా వైద్య సమస్యలు, పేరుకుపోయిన బకాయిలు వంటివి తెర మరుగైపోతున్నాయి. రాజధాని శివార్లలో మంచిరేవుల మహేశ్వరం వంటి చోట్ల భూమి స్కాములు జరిగాయనే పోటాపోటీ కథనాల మధ్య తాజాగా ఇ.డి కూడా విచారణ జరిపింది. అధికార పార్టీలోనూ విభేదాల కథలు కూడా షరామామూలే. అడపాదడపా ప్రకటనలు మినహాయిస్తే కాంగ్రెస్ తన ప్రధాన జాతీయ ప్రత్యర్థి అయిన బిజెపి మత రాజకీయాలపై, కేంద్రం పెత్తనంపై గట్టిగా కార్యక్రమాలు తీసుకున్నది నామమాత్రమే. 2034 వరకూ అంటే వచ్చే ఎన్నికల తర్వాత మరో దఫా కూడా తనే అధికారం చేపట్టి ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి పోతానన్నది రేవంత్ మాట. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి బెంగళూరు మకాం మార్చి మళ్లీ లోటస్ పాండ్‌కు రానున్నారనే వార్తలు కూడా దీంతో పాటే వినిపిస్తున్నాయి. సన్నిహితులుగా పేరున్న కొంతమంది మంత్రులతో సంబంధాలు నెరపడమేగాక సమీకరణలకు తోడవుతున్నా రనేది ఆయనపై పరిశీలకుల వ్యాఖ్య.

**-అమరావతిపై అదే దాడి**

కూటమి పాలన లోని ఆంధ్రప్రదేశ్‌లో అప్పుల భారం, నిధుల కొరత వెన్నాడుతున్నాయి. రాజధాని అమరావతి నిర్మాణంలో కొంత కదలిక వున్నా సమస్యలు, సవాళ్లు చాలానే వుంటున్నాయి. అయితే ఏదో ఒక విధంగా ఈసారి దాన్ని పూర్తి చేయకపోతే ప్రజలు సహించరనే ఒత్తిడి ప్రభుత్వంపై బాగా పని చేస్తున్నా బయిట నుంచి స్పందన పరిమితమే. స్వయం పోషిత రాజధాని అంటున్నా ఇప్పటి వరకూ సర్కారు చేసిన కేటాయింపులు తప్ప భారీగా పెట్టుబడులు వచ్చిందేమీ లేదు. ఇటీవలి కాలంలో వరసగా సింగపూర్ పర్యటనలు జరుపుతుండటం కూడా మరోసారి వారి జోక్యం పెరిగిన సూచనలిస్తున్నది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల తమ పార్టీ సమావేశంలో 'జై అమరావతి బదులు-జై ఆంధ్ర' అనాలని పిలుపునివ్వడం చర్చకు దారితీసింది. మొత్తం దృష్టి ఒక చోటనే పెట్టకుండా వికేంద్రీకరణ జరగాలనే వాదనకు దీనివల్ల బలం చేకూరినట్టయింది. కేంద్రం తరపున ఎలాంటి ఆర్థిక సహాయం చేయని బిజెపి కూడా రాజధానిపై పెద్ద ఆసక్తి చూపడం లేదు. కూటమిలో మిగిలిన పార్టీలు ఈ విషయంలో ఎడంగా వుండటం టిడిపి కి సమస్యగా వుందని 'హిందూ' పత్రిక వ్యాఖ్యానించింది. అయితే మాజీ ముఖ్యమంత్రి జగన్ తాడూ బొంగరం లేని మావిగన్ ప్రతిపాదనను మాత్రం ఎవరూ పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. గత తప్పిదాన్ని సవరించుకుని వాస్తవికంగా అమరావతి సంపూర్తి చేయడానికి నిర్మాణాత్మక సూచనలు చేసే బదులు జగన్ అక్కడ అధిక బిల్లులు చెల్లింపు, అనవసర వ్యయం, ఆశ్రితులకే అవకాశం వంటి ఆరోపణలపైనే నిరంతరం మాట్లాడుతున్నారు. మొన్నటి మీడియా గోష్ఠిలో మరో అడుగు ముందుకేసి మావిగన్ అంటే ముఖ్యమంత్రికి గుండెపోటు వస్తుందని అనవసర ప్రస్తావనలు చేశారు. మాజీ ముఖ్యమంత్రిగా ఇందుకు సంబంధించిన సంఖ్యా వివరాలు, పదేళ్ల పరిణామాలు సమగ్రంగా సమీక్షా పూర్వకంగా చెబుతున్నారా అంటే అదీ లేదు.

**-కొత్త వివాదాలు, కేసులు**

ప్రాంతాల సమతుల్యత, పాలనా వికేంద్రీకరణ, సామాజిక న్యాయం తప్పనిసరి అవసరమే గానీ ప్రాంతాల మధ్య తేడాలు, కులాల వారీ సమీకరణలు పెరగడం మాత్రం సరైంది కాదు. తమది గన్ కల్చర్ అంటున్న టిడిపి కి సమాధానంగా తన కుటుంబ సభ్యుల హత్యలను, మరణాలను జగన్ ప్రస్తావించడం కొత్త చర్చకు దారితీసింది. తాత రాజారెడ్డి హత్య, వైఎస్ ప్రమాద మరణం, బాబాయి వివేకానందరెడ్డి హత్యలను అధికారంలో వున్నప్పుడు సమగ్రంగా విచారించకుండా ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడెందుకు ముందుకు తెచ్చారనే ప్రశ్న అన్ని వైపుల నుంచి వస్తున్నది. నిజానికిది జగన్ సెల్ఫ్ గోల్ అనే మాట వినిపిస్తున్నది. దీనికి తగినట్టే టిడిపి అనుకూల మీడియా ఆనాడు రాజారెడ్డి హత్యలో శిక్షలు పడిన, దాడికి గురైన వారిని ముందుకు తెచ్చింది. జగన్ నరరూప రాక్షసులంటూ, రక్తం తాగుతారంటూ తీవ్ర భాషలో కథనాలు ఫోకస్ చేయడం అభద్రత పెంచడానికే దారి తీస్తుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కూటమిలో ఇక్కడ జూనియర్ భాగస్వామి అయినా దేశాన్ని పాలిస్తున్న బిజెపి వీటిని అవకాశంగా తీసుకుని మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం తీవ్రం చేస్తున్నది. రఘురామ కృష్ణంరాజు వంటి వారి వల్ల చిచ్చు రాజుకున్న ఆకివీడులో సుప్రీం కోర్టు స్టే ఇచ్చినప్పటికీ దాని ఆధారంగా ప్రశాంతత తీసుకొచ్చే చొరవ ప్రభుత్వం చూపడం లేదు. తాము పదిహేనేళ్లు కూటమిగా వుంటామని పవన్ కల్యాణ్ పదే పదే ప్రకటిస్తున్నప్పటికీ బిజెపి నుంచి ఆ విధమైన వ్యాఖ్యలేమీ లేవు. వైసిపి, టిడిపి, జనసేనలతో సంబంధాల గురించి కేంద్ర బిజెపి నేతలు వ్యాఖ్యల పేరిట తాజాగా కొత్త దుమారం చెలరేగింది. చివరకు ఆ విషయం చెప్పిన ప్రొఫెసర్ నాగేశ్వర్ వాటిని ఉపసంహరించుకున్నట్టు ప్రకటించినా ఆయనపై ఫిర్యాదులు అలాగే వున్నాయి. ప్రాంతీయ పార్టీలతో బిజెపి చదరంగం చెలగాటం తెలిసిందే. నిజానికి మాజీ ప్రస్తుత వైసిపి నేతలపై ఈ కాలంలో ఈడీ దాడులు కూడా జరిగాయి. గనక ఈ విషయంలో ఎవరూ తుది మాట చెప్పలేరు. ఏమైనా మీడియా వ్యాఖ్యలపై ఖండనలు, ప్రకటనలు చేయొచ్చుగాని అరెస్టులు, కేసులు మాత్రం అవాంఛనీయం. ఎవరి రాజకీయాలు ఏమైనప్పటికీ వ్యర్థ వివాదాలను విడనాడి ప్రజా ప్రయోజనాల కోసం ఉమ్మడిగా దృష్టి పెట్టడమే శ్రేయస్కరం.

# అన్నదాత కోసం దుర్గం అశోక్ ఉద్యమం


-రైతు చెమటకు న్యాయం చేయాలన్న దుర్గం అశోక్..

-వడ్ల కొనుగోళ్ల జాప్యంపై తహసీల్దార్‌కు వినతి..

-రైతు సమస్యలపై బీజేపీ నేతల ఆగ్రహం..

-కొనుగోలు కేంద్రాల వద్ద అన్నదాతల ఆవేదన..

హంసకలం వార్త మే 25 మంచిర్యాల జిల్లా ప్రతినిధి





ఎండలోనూ వానలోనూ కుటుంబాన్ని పక్కన పెట్టి పొలం కోసం శ్రమించే రైతే దేశానికి అన్నం పెట్టే అన్నదాత. రైతు చెమటతోనే గ్రామాలు బతుకుతాయి.. రైతు కష్టంతోనే మార్కెట్లు కదులుతాయి రైతు పండించిన ధాన్యంతోనే ప్రతి ఇంటి పొయ్యి వెలుగుతుంది. అలాంటి రైతు పంటను అమ్ముకునే సమయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రోజులు తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద నిరీక్షించాల్సి రావడం దురదృష్టకరమని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న తీవ్ర జాప్యంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ చెన్నూరు తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. రైతుల పక్షాన ఎప్పటికప్పుడు గళమెత్తుతున్న చెన్నూరు నియోజకవర్గ బీజేపీ నాయకుడు దుర్గం అశోక్ మరోసారి రైతు సమస్యలపై అధికారులను నిలదీశారు. కొనుగోలు కేంద్రాల్లో తూకాల ఆలస్యం, రవాణా సౌకర్యాల లోపం, ధాన్యం నిల్వ సమస్యలు, చెల్లింపుల జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు వివరించారు. పంట కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులు రోజులు గడుస్తున్నా సరైన స్పందన లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుర్గం అశోక్ మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని పేర్కొన్నారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరిస్తే బీజేపీ ప్రజల తరఫున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ రైతుల తరఫున పోరాడుతున్న దుర్గం అశోక్ నాయకత్వాన్ని స్థానిక బీజేపీ శ్రేణులు ప్రశంసించాయి. రైతుల హక్కుల కోసం కట్టుబడి పనిచేసే నాయకుడిగా ఆయనకు ప్రజల్లో విశేష ఆదరణ ఉందని కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుర్ర రాజశేఖర్ గౌడ్, తుమ్మ శ్రీపాల్, ఏకాం శివకృష్ణ, గర్రెపల్లి శాంతారాణి, వెంకట నరసయ్యతో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు..

# రైతుల గింజ గింజకు ప్రభుత్వ భరోసా

-చెన్నూర్‌లో ధాన్యం కొనుగోళ్లు వేగం..

-రైతులకు అండగా ప్రభుత్వం..

-ధాన్యం తరలింపుకు 75 లారీలు..

-వారం రోజుల్లో పూర్తి కొనుగోళ్లు..

హంసకలం వార్త మే 25 మంచిర్యాల జిల్లా ప్రతినిధి



చెన్నూర్ నియోజకవర్గంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఈ ఏడాది చెన్నూర్ ప్రాంతంలో అంచనాలకు మించి వరి దిగుబడి రావడంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తే కొనుగోలు ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ కోసం అదనపు గోదాముల సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ధాన్యం తరలింపులో ఆలస్యం లేకుండా హమాలీల సంఖ్యను పెంచడంతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న లారీలకు అదనంగా మరో 75 లారీలను కేటాయించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతులు కేంద్రాల వద్ద రోజులు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం నిరంతరం కొనుగోలు ప్రక్రియను సమీక్షిస్తోందని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం, తరలింపు, నిల్వ ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రాబోయే వారం రోజుల్లో రైతుల వద్ద ఉన్న ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి అపోహలు, ఆందోళనలు పెట్టుకోకుండా వెంటనే తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. అకాల వర్షాల నడుమ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, చెన్నూర్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు..

# నల్ల పోచమ్మ ఆలయంలో కొత్త కమిటీ బాధ్యతలు

మూసాపేట్, మే 25 ( హంసకలం వార్త )

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ లక్ష్మీకళ సినిమా హాల్ సమీపంలో ఉన్న నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతన ఆలయ కమిటీ చైర్మన్‌గా రాచమల్ల బిక్షపతి గౌడ్ ప్రమాణ స్వీకారం చేయగా, సభ్యులుగా కావాలి పాండు, ఎం. రమేష్, మెట్టు వినోద్, పి. నర్సింగ్ రావు, నోముల బాబురావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ గతంలో చిన్న గుడిగా ఉన్న నల్ల పోచమ్మ ఆలయాన్ని పునర్నిర్మాణం చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చిన మాజీ కౌన్సిలర్ తూము ఎల్లారావును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన దేవాదాయ శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఆలయం కేవలం పూజలు జరిగే స్థలం మాత్రమే కాదని, అది సంస్కృతి, సంప్రదాయం, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. భక్తి భావంతో సేవా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు మరింత విస్తరించాలని సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, దేవాలయాల పరిరక్షణ, ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగు తోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, ఏ బ్లాక్ అధ్యక్షుడు పటోళ్ల నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మయ్య, గొట్టిముక్కల వెంకటేశ్వర్ రావు, గాలి బాలాజీ, కోపిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, నియోజకవర్గ ఓబీసీ అధ్యక్షుడు తూము సంతోష్, రాచమల్ల శేఖర్ గౌడ్, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..



# డ్రైనేజీలో దిగి కూలీ దుర్మరణం

బాలానగర్, మే 25 ( హంసకలం వార్త )

బాలానగర్ పారిశ్రామికవాడలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. డ్రైనేజీ శుభ్రపరిచే పనుల కోసం మ్యాన్‌హోల్‌లోకి దిగిన దినసరి కార్మికుడు వల్లపు నరసింహ (43) విషవాయువులకు గురై ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,ఫతేనగర్‌కు చెందిన వల్లపు నరసింహ బాలానగర్ లేబర్ అడ్డాలో దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే డ్రైనేజీ శుభ్రపరిచే పనులు అధికారిక సిబ్బందే చేయాలనే నిబంధనలు ఉన్నప్పటికీ, వీర్ కెమి ఆగ్రోమాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన కాంట్రాక్టర్ ఒత్తిడి చేయడంతో నరసింహ ఎలాంటి రక్షణ పరికరాలు లేకుండానే మ్యాన్‌హోల్‌లోకి దిగినట్లు సమాచారం. మ్యాన్‌హోల్‌లో పేరుకుపోయిన విషవాయువులు, ఊబి కారణంగా నరసింహ క్షణాల్లోనే స్పృహ కోల్పోయాడు. స్థానికులు వెంటనే అప్రమత్తమై బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. నరసింహ మృతితో భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కాంట్రాక్టర్, సంస్థ యాజమాన్యం నిర్లక్ష్యమే తమ కుటుంబ పెద్ద ప్రాణాలు తీసిందని ఆరోపిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# బీసీ గణనకు కాంగ్రెస్ మద్దతు గళం



శేరిలింగంపల్లి, మే 25 ( హంసకలం వార్త )

దేశంలో బీసీ జనాభా గణనను పూర్తిస్థాయిలో నిర్వహించి, కులాల వారీగా రిజర్వేషన్లు అమలు చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. జనాభా లెక్కల సేకరణలో భాగంగా ఎన్యుమరేటర్ సిబ్బందికి పూర్తి సహకారం అందించిన ఆయన, పట్టికల్లో బీసీ సామాజిక వర్గాల వివరాలకు స్థానం లేకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో బీసీ గణన అంశాన్ని బలంగా ప్రస్తావించిన తర్వాతే కేంద్రం జనాభా లెక్కల ప్రక్రియను ప్రారంభించిందని అన్నారు. అయితే ప్రస్తుతం చేపడుతున్న లెక్కలు కేవలం కంటితుడుపు చర్యలుగానే కనిపిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వానికి బీసీలపై నిజమైన చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తెలంగాణలో బీసీ కమిషన్ ఏర్పాటు చేసి దేశానికే దిక్సూచిగా నిలిచిందని పేర్కొన్న అనిల్ కుమార్ యాదవ్, బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే కాంగ్రెస్ పార్టీతో పాటు కూటమి పార్టీలన్నీ మద్దతు ఇస్తాయని గుర్తుచేశారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ జనాభా గణన చేపట్టి, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేస్తామని స్పష్టం చేశారు..

# కూకట్‌పల్లిలో బీఆర్ఎస్ గర్జన

-కూకట్‌పల్లిలో కేటీఆర్ పవర్ షో..

-అభివృద్ధి మాది.. ప్రచారం కాంగ్రెస్‌ది..

-24 గంటల నీరు ఇస్తాం.. బీఆర్ఎస్ హామీ..

-కష్టపడిన వారికే టికెట్..కేటీఆర్

-మళ్లీ బీఆర్ఎస్ అధికారమే కేటీఆర్ ధీమా..




కూకట్‌పల్లి, మే 25 ( హంసకలం వార్త )

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను అబద్ధపు హామీలతో మోసం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు మండిపడ్డారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి పాల్గొన్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, అప్పటి మంత్రి కేటీఆర్ సహకారంతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని తెలిపారు. బాలనగర్, జేఎన్టీయూ, కైతలాపూర్ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, నీటి ట్యాంకులు, ఎస్టీపీ ప్లాంట్లు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, ఓపెన్ జిమ్‌లు, పార్కులు ఏర్పాటు చేశామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క అభివృద్ధి పని కూడా ముందుకు సాగలేదని, బీఆర్ఎస్ నిర్మించిన ఫ్లైఓవర్లను తమవిగా చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. గతంలో ప్రతి నెలా రూ.30 కోట్ల వరకు నిధులు మంజూరయ్యేవని, ప్రస్తుతం రెండున్నర సంవత్సరాలు గడిచినా రూ.25 కోట్లు కూడా విడుదల కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా నిలిచిపోయాయని ఆరోపించారు. అనంతరం కేటీఆర్ ఎస్ఐఆర్ ఓటర్ల నమోదు, ఓట్ల తొలగింపు ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు వివరించారు. ఓటు మీ హక్కు అంటూ ఓటు ప్రాధాన్యతను వివరించి, ఇంటికి వచ్చే అధికారులకు ఎలా సమాచారం ఇవ్వాలో ప్రజలకు సూచనలు చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో మాధవరం కృష్ణారావు నాయకత్వంలో కార్యకర్తలు సైనికుల్లా పని చేసి రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ అందించారని కేటీఆర్ కొనియాడారు. భవిష్యత్తులో లక్ష మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన ప్రతి కార్యకర్తను బీఆర్ఎస్ గుర్తుంచుకుంటుందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల్లో పని చేసే వారికే కార్పొరేటర్ టికెట్లు కచ్చితంగా లభిస్తాయని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే 24 గంటల విద్యుత్‌తో పాటు 24 గంటల మంచినీటి సరఫరా బాధ్యత తీసుకుంటామని ప్రకటించారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇందిరమ్మ ఇల్లు అయినా నిర్మించిందా అని ప్రశ్నించిన కేటీఆర్, నిర్మించినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంభిపూర్ రాజు, గజ్జల నాగేశ్, రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావు, పగుడాల బాబురావు, తూము శ్రావణ్ కుమార్, సబియా గౌసుద్దీన్, మహేశ్వరి శ్రీహరి, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా పాల్గొన్నారు..

## ప్రజావాణి ఫిర్యాదులు బుట్టదాఖలు





మేడ్చల్, మే 25 ( హంసకలం వార్త )

మంజీరా రోడ్డులో కల్వర్టు నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న మిద్దెల మల్లారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నాలుగు నెలలుగా ప్రతి ప్రజావాణిలో కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలని ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమస్యపై సైబరాబాద్ కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రజల రాకపోకలు అధికంగా ఉండే మంజీరా రోడ్డులో కల్వర్టు పేరుతో రహదారిని తవ్వి అలాగే వదిలేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రకటించిన 99 రోజుల పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని, నేలమీద పరిస్థితులు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. తక్షణమే కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని డిప్యూటీ కమిషనర్ శశిరేఖ రెడ్డికి మరోసారి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయకపోతే ఎప్పుడైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అమాయకుల ప్రాణాలు బలికావచ్చని మిద్దెల మల్లారెడ్డి హెచ్చరించారు..

## కేటీఆర్ సభకు భారీగా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు





బోయిన్‌పల్లి, మే 25 ( హంసకలం వార్త )

కూకట్ పల్లిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నిర్వహిస్తున్న విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు, యువత, అభిమానులు భారీగా తరలివెళ్లారు. బోయిన్‌పల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలతో కలిసి సమావేశ ఏర్పాట్లను ప్రారంభించిన ముద్దం నర్సింహ యాదవ్ అనంతరం భారీ కాన్వాయ్‌తో సభా ప్రాంగణానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, కార్యకర్తల సమన్వయం, రాబోయే రాజకీయ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం జరుగనుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన చేసే ప్రతి ఉద్యమంలో కార్యకర్తలు సైనికుల్లా ముందుండాలని ముద్దం నర్సింహ యాదవ్ పిలుపునిచ్చారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు..

## నల్ల పోచమ్మ ఆలయ కమిటీకి అభినందనల వెల్లువ




మూసాపేట్, మే 25 ( హంసకలం వార్త )

మూసాపేట్ మెయిన్ రోడ్డుపై ఉన్న నల్ల పోచమ్మ అమ్మవారి నూతన ఆలయ కమిటీ చైర్మన్‌గా రాచమల్ల బిక్షపతి గౌడ్ నియమితులవడంతో స్థానికంగా ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. కమిటీ సభ్యులుగా కావాలి పాండు, ఎం. రమేష్, మెట్టు వినోద్, పి. నర్సింగ్ రావు, నోముల బాబురావు నియామకాలను పురస్కరించుకొని పలువురు అభినందనలు తెలిపారు. మూసాపేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గురజాల రమేష్, కృష్ణ తదితరులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు..

## గోవులను భక్తితో పూజించి రక్షించాలి

సైబరాబాద్, మే 25 ( హంసకలం వార్త )



గోవులను భక్తితో పూజించి వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్ రెడ్డి పేర్కొన్నారు. బక్రీద్ పండుగను శాంతి యుతంగా, సామరస్య వాతావరణంలో, ఐక్యతతో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని తెలిపారు. మత సామరస్యాన్ని పరిరక్షిస్తూ ప్రతి పండుగను పరస్పర గౌరవంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ కూకట్‌పల్లి ప్రాంతంలో గోవుల సంరక్షణ కోసం పోలీసులు విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో గోశాలలకు తగిన స్థలాలు లేకపోవడం వల్ల గోవుల పోషణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. మంచినీరు, గడ్డి, పశుగ్రాసం కొరత ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో విశాలమైన గోశాలలు ఏర్పాటు చేసి గోవులను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమానికి అవకాశం కల్పించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్ రెడ్డి, బాలానగర్ డీసీపీ, కూకట్‌పల్లి ఏసీపీ, కూకట్‌పల్లి సీఐ, పోలీసు సిబ్బందికి జనంపల్లి పురేందర్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, యశ్వంత్, లక్ష్మీనారాయణ, జి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

# సీఎం రేవంత్‌తో బండి రమేష్ భేటీ

-సీఎం రేవంత్‌ను కలిసిన బండి రమేష్..
-కమ్మ సంఘాల ఐక్యతపై సీఎం దిశానిర్దేశం..
-పేదల అభివృద్ధే కార్పొరేషన్ లక్ష్యం..
-సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

కూకట్‌పల్లి, మే 25 ( హంసకలం వార్త )

తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బండి రమేష్ సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి రమేష్ ముఖ్యమంత్రికి పూల బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బండి రమేష్‌కు అభినందనలు తెలియజేస్తూ కమ్మ కార్పొరేషన్ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. రాష్ట్రంలోని కమ్మ సంఘాలన్నింటిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమ న్వయంతో ముందుకు నడిపించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాలకు కార్పొరేషన్ ద్వారా మరింత సహాయం అందేలా కృషి చేయాలని సూచించినట్లు సమాచారం. అలాగే యువతలో రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు బండి రమేష్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు, సంఘ ప్రతినిధులు, కార్పొరేషన్ సభ్యులతో సమ న్వయం చేసుకుంటూ పని చేయాలని సీఎం దిశానిర్దేశం చేసినట్లు వెల్లడించారు. తనకు అప్పగించిన పదవికి మరింత గౌరవం



తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తానని బండి రమేష్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా కమ్మ కార్పొరేషన్‌ను ప్రజలకు ఉపయోగపడే వేదికగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. పేదల సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాల కల్పన, యువత ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ భేటీ సందర్భంగా కమ్మ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు పరుచూరి మురళి తదితరులు పాల్గొన్నారు..

# బక్రీద్‌కు సైబరాబాద్ హై అలర్ట్

సైబరాబాద్, మే 25 ( హంసకలం వార్త )

రాబోయే బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు సైబరాబాద్ పోలీసులు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టారు. మత సామరస్యం కాపాడుతూ ప్రజలంతా పరస్పర గౌరవంతో పండుగలను జరుపుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ పిలుపునిచ్చారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ, బక్రీద్ వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారని తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఫేక్ న్యూస్, పాత వీడియోలు, అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద సమాచారం కనిపించిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. గత 45 రోజులుగా



బక్రీద్ పండుగ కోసం ప్రత్యేక ప్రణాళికతో పోలీస్ శాఖ పనిచేస్తోందని తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇతర శాఖలతో సమన్వయంగా భద్రతా చర్యలు చేపట్టామని వెల్లడించారు. కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి మాట్లాడుతూ, భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని, అన్ని వర్గాల ప్రజలు శాంతి సామరస్యాలతో పండుగలు జరుపుకోవాలని కోరారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి



పరిస్థితిలో పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తారని చెప్పారు. యువత, వాలంటీర్లు ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ మాట్లాడుతూ, పీస్ కమిటీ సభ్యులు సమాజంలో శాంతి స్థాపనకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఎలాంటి అశాంతి పరిస్థితులు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సైబరాబాద్ పరిధిలోని స్టేషన్ హౌస్ అధికారులు, హిందూ, ముస్లిం మత పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

# జీడిమెట్లలో మజ్జిగతో మానవ సేవ

జీడిమెట్ల, మే 25 ( హంసకలం వార్త )

వేసవి ఎండలు రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో జీడిమెట్ల సుభాష్‌నగర్ బస్ డిపో వద్ద బీఆర్ఎస్ నాయకులు కోలా శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో భారీగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రారంభించి పాదా చారులు, కార్మికులు, ప్రయాణికులకు స్వయంగా మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేయడం గొప్ప సేవా కార్యక్రమమని అన్నారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పాదాచారులకు చల్లని




మజ్జిగ అందించడం మానవత్వానికి నిదర్శనమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు యువత మరింతగా చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం నగరంలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నందున ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తగినంత నీరు, మజ్జిగ వంటి శీతల పానీయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ నాయకులు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమానికి



స్థానిక ప్రజలు, ప్రయాణికులు మంచి స్పందన తెలిపారు. ఎండలో ప్రయాణిస్తున్న వారికి మజ్జిగ పంపిణీ చేయడంతో పలువురు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, డాక్టర్ హుస్సేన్, గుబ్బల లక్ష్మీనారాయణ, కట్ట సుందర్ బాబు, కట్ట సుకుమార్, ప్రేమ్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ ఫైర్

-ధాన్యం కొనుగోళ్లలో భారీ జాప్యం.!..
-వర్షాలకు తడుస్తున్న రైతుల పంట..
-కలెక్టర్‌కు బీజేపీ కిసాన్ మోర్చా ఫిర్యాదు..
-రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం..రాజేందర్ రెడ్డి

సంగారెడ్డి, మే 25 ( హంసకలం వార్త )

సంగారెడ్డి జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి నాయకత్వంలో నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లేపల్లి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ



జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతుల పంటలను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తోందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌక ర్యాలు లేక రైతులు రోజులు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెల కొన్నదన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచిన ధాన్యం



తడిసిపోయే ప్రమాదం ఉందని, వెంటనే కొనుగోళ్లు చేపట్టకపోతే రైతులకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కష్టపడి పండించిన పంటను వెంటనే కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తగిన వసతులు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న విధానాలను ప్రభుత్వం వెంటనే మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాణిక్యరావు, ఈర్ల రాజు ముదిరాజ్, వాసు, బాల్రాజ్, కృష్ణ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శివ, మాణిక్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, శుభం రెడ్డి పాల్గొన్నారు..

# నేరుగా ప్రజల దగ్గరికి సాధారణ వ్యక్తిలా జిల్లా కలెక్టర్

-మే 30లోగా పెన్షనర్ల లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేయాలి
-ప్రతి ఇంటి వివరాలు కచ్చితంగా నమోదు చేయాలి
-అభివృద్ధి ప్రణాళికలకు జనగణన గణాంకాలే ఆధారం
-జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్
-30లోగా పెన్షనర్ల లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేయాలని సూచన

మే 25 ( హంసకలం వార్త )

జూన్ 9లోగా 100 శాతం జనగణన ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అందించే, చేయూత పెన్షనర్ల లైవ్ ఆథెంటికేషన్ ప్రక్రియను పరిశీలిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు ఈ ప్రక్రియ అత్యంత కీలకమని పేర్కొన్నారు. మే 30లోగా లైవ్ ఆథెంటికేషన్‌ను పూర్తిస్థాయిలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు వంటి లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి సేవలు అందించాలని సూచించారు. ఎవరూ



పెన్షన్‌కు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని స్పష్టం చేశారు. బయోమెట్రిక్ ధృవీకరణ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జన గణనలో భాగంగా కొనసాగుతున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ లో హౌస్ లిస్టింగ్ నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ సోమవారం పరిశీలన జరిపారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు గుర్తింపు కార్డులు ధరించారా లేదా అన్నది గమనించారు. వారు జన గణన విధులు నిర్వర్తిస్తున్న తీరును పరిశీలించి, ఇప్పటివరకు హౌజ్ లిస్టింగ్ ఎంత శాతం పూర్తయ్యింది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వీయ గణన చేసుకున్న వారికి సంబం ధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, పక్కాగా నిర్ధారణ చేసుకోవాలని కలెక్టర్



సూచించారు. జనగణన ప్రక్రియ అత్యంత బాధ్యతాయుతమైన కార్యక్రమమని పేర్కొంటూ ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. తప్పిదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తగా జన గణన జరపాలని అన్నారు. జన గణనకు సంబంధించి ప్రగతిని తెలియజేస్తూ రోజువారీ నివేదికలు పంపాలని ఆదేశించారు. జూన్ 9లోగా 100 శాతం ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని సిబ్బందికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారు. భవిష్యత్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు, నిధుల కేటాయింపులో జనగణన గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అందువల్ల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, , రెవెన్యూ అధికారులు, జనగణన సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# పెట్రోల్ డీజిల్ ధర పెంపుపై నిరసన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి

మే 25 ( హంసకలం వార్త )

కేంద్ర ప్రభుత్వంపెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనె తగ్గించాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తు జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి తహసీల్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగిత్యాల ఆర్డీఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడి పాలిట శాపంగా మారాయని మంత్రి అడ్లూరి అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతం పేరుతో రాజకీయాలు చేయడం తప్ప పేద ప్రజల సంక్షేమం ఏనాడు పట్టించుకోవడంలేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి మోడి పెట్రోల్, డీజిల్ ధరల విషయం మాట్లాడలేదని అన్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు, కేరళ మరియు పచ్చిమబెంగాల్ ఎన్నికల పూర్తి అయిన తరువాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని మంత్రి ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోడి ప్రభుత్వం దేశ ప్రజలు ఎవ్వరు విలాసవంతాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చిందని దీని అర్థం మన దేశ ఆర్థిక వ్యవస్థ అస్థవ్యస్తంగా మారిందని భావించవచ్చని మంత్రి అడ్లూరి అన్నారు. రూపాయి విలువ రోజు రోజుకు పడిపోతున్న మోడి మాత్రం నిద్ర లేవడం లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగాఉన్న బీఆర్ఎస్ పార్టీ నరేంద్ర మోడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడం లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు, జీవన్రెడ్డిలు ఎందుకు బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడం లేదని మంత్రి ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు బండి భగీరథ్ అంశంపై ఎందుకు బీఆర్ఎస్ నాయకులు నోరు మోదపడం లేదని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండు ఒక్క టేనని మంత్రి అడ్లూరి అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పెట్రోల్, డీజిల్ ధరల పెంపు మీద ఉన్న దృష్టి ధాన్యం కొనుగోలు, మక్కల కొనుగోలుపై లేదని మంత్రి అడ్లూరి ఆరోపించారు. రైతుల వద్ద నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు పంటల వడ్లు కొనుగోలు చేస్తే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోఉన్న ఎఫ్ సీ ఐ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి బియ్యం సేకరించడం లేదని మంత్రి అడ్లూరి అన్నారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటివరకు 3లక్షల మెట్రిక్




టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని మిగిలిన లక్ష 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు తగ్గించాలని రాష్ట్రంలో రైతుల వద్ద కొనుగోలు చేసిన మక్కలతో పాటు ఎఫ్ సీ ఐ ద్వార బియ్యం సేకరించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈకార్య క్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ జువ్వాడి నర్సింగ రావు, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందయ్య, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణితో పాటు జగిత్యాల జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్లాష్...ప్లాష్...ప్లాష్

# సూర్యాపేట మండలంలో మరో హత్య కలకలం

-ఒక హత్య జరిగి రెండు రోజులు కాకముందే మరో హత్య
-వరుస ఘటనలతో జిల్లాలో భయానక వాతావరణం

మే 25 ( హంసకలం వార్త )

రూరల్ మండలం సోలిపేట గ్రామంలో జరిగిన హత్య ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఇటీవల ఒక హత్య ఘటన మరువక ముందే మరో హత్య చోటు చేసుకోవడంతో సూర్యాపేట జిల్లాలో భయానక వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన మేకల జయరాములు (50) ను భూతగాదాల నేపథ్యంలో అన్న కొడుకు హత్య చేసినట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి వచ్చింది. మృతుడు జయరాములకు నలుగురు అన్నదమ్ములు ఉండగా, వారిలో ఒకరైన కృష్ణయ్యతో వ్యవసాయ భూమికి సంబంధించిన వివాదం కొన్నేళ్లుగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కృష్ణయ్య కుమారుడు పొలంలో బోర్ వేయించడంతో కుటుంబ సభ్యుల మధ్య వివాదం మరింత ముదిరినట్లు సమాచారం. సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఆగ్రహానికి లోనైన కుటుంబ సభ్యులు జయరాములుపై దాడి చేసి హత్య చేసినట్లు తెలుస్తోంది.ఈ ఘటనలో



ప్రధాన నిందితుడు సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడని మృతుడి భార్య ఆరోపిస్తోంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ బాలు నాయక్ ఆధ్వర్యంలోని పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.వరుస హత్య ఘటనలతో జిల్లా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భూతగాదాలు, కుటుంబ విభేదాలు, రాజకీయ కక్షలు హింసాత్మక ఘటనలకు దారితీయకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

-పలు సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్
-ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 76




మే 25 ( హంసకలం వార్త )

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ అదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 76 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## గ తీవ్ర ఎండలు, వడగాలుల నేపథ్యంలో ప్రజలు

# అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..
-అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దు..



మే 25 ( హంసకలం వార్త )

జిల్లాలో తీవ్ర ఎండలు, వడగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్నందున, ముఖ్యంగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం అధికంగా ఉండడంతో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలు తరచుగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే పండ్లను తీసుకోవాలని తెలిపారు. బయటకు వెళ్లే సమయంలో గొడుగు, టోపీ, తడి గుడ్డ వంటివి ఉపయోగించాలని, పలుచటి, లేత రంగు దుస్తులు ధరించాలని సూచించారు. వీలైనంత వరకు చెట్ల నీడలో లేదా చల్లని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. భారీ భోజనాలు, మద్యం, కాఫీ వంటి డీహైడ్రేషన్‌కు కారణమయ్యే పానీయాలను నివారించాలని, చిన్నపిల్లలను వృద్ధులను ఎండలో ఎక్కువసేపు ఉంచవద్దని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే పార్క్ చేసిన వాహనాల్లో పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వదిలి పెట్టవద్దని సూచించారు. వడదెబ్బ లక్షణాలైన అధిక జ్వరం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు, అలసట, చెమట ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే బాధితులను చల్లని ప్రదేశానికి తరలించి, చల్లటి నీటితో శరీరాన్ని తడపాలని తెలిపారు. ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని, అవసరమైతే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# బిజినెస్

## స్టాక్ మార్కెట్లలో లాభాల సునామీ.. 1073 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో సోమవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాలతో ముగిశాయి. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న ఆశలతో ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారుల సెంటిమెంట్ బలపడింది. ఈ ప్రభావంతో సూచీలు రోజంతా లాభాల్లోనే పయనించాయి. ట్రేడింగ్ ముగిసే సమయాని కి, బీఎస్ఈ సెన్సెక్స్ 1,073.61 పాయింట్లు లాభపడి 76,488.96 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 312.4 పాయింట్లు పెరిగి, కీలకమైన 24,000 మార్కును తిరిగి అధిగమించి 24,031.7 వద్ద ముగిసింది. ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహం నెలకొంది. ఈ వ్యాఖ్యలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న అంచనాలు పెరిగి, ప్రపంచవ్యాప్తంగా రిస్క్ ఆస్తులకు మద్దతు లభించింది. టెక్నికల్ పరంగా, నిఫ్టీకి 24,100 వద్ద తక్షణ నిరోధం ఉందని, దానిని దాటితే 24,300 - 24,350 జోన్ తదుపరి నిరోధకంగా పనిచేస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు, 23,950 - 24,000 స్థాయి కీలక మద్దతుగా మారిందని తెలిపారు. ఈ ర్యాలీకి బ్యాంకింగ్ రంగ షేర్లు నాయకత్వం వహించాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు మెరుగైన ప్రదర్శన చేశాయి. బ్రాడర్ మార్కెట్లోనూ కొనుగోళ్ల సందడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.94 శాతం, స్మాల్‌క్యాప్ 1.37 శాతం చొప్పున లాభ పడ్డాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఐషర్ మోటార్స్, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ఇదే సమయంలో, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.45 శాతం బలపడి 95.22 వద్ద ట్రేడ్ అయింది.

## చైనా కొత్త రూల్స్.. భారత్ 120 బిలియన్ డాలర్ల ఎలక్ట్రానిక్స్ కల చెదిరిపోనుందా



కరోనా మహమ్మారి తర్వాత చైనాకు ప్రత్యామ్నాయంగా, ప్రపంచానికి ఒక సరికొత్త గ్లోబల్ తయారీ కేంద్రంగా ఎదగాలని భారత్ గట్టిగా ప్రయత్నిస్తూ వస్తోంది. అందుకు అనుగుణంగా పరిశ్రమలు సిద్ధమవుతున్న తరుణంలో చైనా తన సరఫరా గొలుసు పై (సప్లై చైన్) పట్టును మరింత బిగించింది. ఆ దేశం తాజాగా తీసుకొచ్చిన కొత్త ఎగుమతి నిబంధనల వల్ల భారత్‌లో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ రంగాలు భారీ కుదుపునకు లోనయ్యే అవకాశాలు ఉన్నాయి.

**'డిక్రీ 834, 835' అస్త్రం**

చైనా ప్రభుత్వం 'స్టేట్ కౌన్సిల్ డిక్రీ 834, 835' పేరుతో కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఆధునిక సాంకేతికత, కీలక యంత్రాలు, ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించింది. తమ ఫ్యాక్టరీలను వేరే దేశాలకు తరలించే కంపెనీలు లేదా అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఈ కొత్త రూల్స్ ఉన్నాయి. భారత్‌లోని ఎలక్ట్రానిక్స్ రంగం ఇప్పటికీ చైనా యంత్రాలు, ముడి సరకులపైనే ఎక్కువగా ఆధారపడటం వల్ల మన కంపెనీల్లో ఇప్పుడు తీవ్ర ఆందోళన మొదలైంది.

**ఎలక్ట్రానిక్స్ కలలకు బ్రేక్ పడేనా?**

భారతదేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 2015లో 8.6 బిలియన్ డాలర్ల నుంచి 2025 నాటికి 47 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరాయి. ఈ 2026 చివరి నాటికి దీన్ని ఏకంగా 120 బిలియన్ డాలర్లకు చేర్చాలని కేంద్ర ఐటీ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే యాపిల్ సప్లయర్స్ విస్తరణ, సెమీకండక్టర్ ప్లాంట్ల వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు కావలసిన కీలక విడిభాగాలను చైనా అడ్డుకుంటే ఈ లక్ష్యం నెరవేరడం కష్టంగా మారుతుంది. కార్ల తయారీ రంగంలో కూడా దాదాపు 26 శాతం హైవాల్యూ ఎలక్ట్రానిక్స్ విడిభాగాలు చైనా నుంచే వస్తున్నాయి.


**కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోంది?**

చైనా చర్యలపై కేంద్ర రక్షణ, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. చైనా లాంటి కొన్ని నిర్దిష్ట దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించడానికి రంగాల వారీగా పెట్టుబడి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి రూ.33,660 కోట్లతో 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' కింద రాబోయే మూడేళ్లలో 50 ఇండస్ట్రియల్ పార్కులను ప్రారంభించాలని కేంద్రం ప్లాన్ చేస్తోంది.

**అసెంబ్లింగ్ కాదు.. సొంతంగా ఎదగాలి**

చైనా ఆంక్షలు భారత్‌కు ఒక రకంగా హెచ్చరిక లాంటివని పరిశ్రమ నిపుణులు అంటున్నారు. మనం కేవలం వేరే దేశాల విడిభాగాలను తెచ్చి ఇక్కడ బిగించే స్థాయి నుంచి బయటకు రావాలని సూచిస్తున్నారు. గుజరాత్‌లో భారీ యాక్టివ్ ఎల్ఈడీ డిస్‌ప్లే ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన ఎల్ఈడీఎక్స్ లాంటి కంపెనీలు ఇప్పటికే స్వదేశీ ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాయి. కేవలం చైనాను రీప్లేస్ చేయడం మాత్రమే కాకుండా, భారత్ స్వయంసమృద్ధి సాధిస్తేనే గ్లోబల్ మార్కెట్‌లో నమ్మకమైన భాగస్వామిగా ఎదగగలదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## ఈ చిన్న మార్పులతో మీ సేవింగ్స్‌ను గణనీయంగా పెంచుకోవచ్చు!



పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించడం లేదా లాభసాటి పెట్టుబడులు పెట్టడం వల్ల మాత్రమే ఎవరూ ధనవంతులు కాలేరు. నిత్యం మనం చేసే చిన్న చిన్న అనవసరపు ఖర్చులను తగ్గించుకుంటేనే దీర్ఘకాలంలో భారీగా సంపదను సృష్టించవచ్చని ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**చిన్న ఖర్చులకు బ్రేక్**

మనం ప్రతిరోజూ అలవాటుగా కొనే కాఫీలు లేదా స్నాక్స్ లాంటి చిన్న చిన్న ఖర్చులు పెద్దగా నష్టం చేయవని అనుకుంటాం. కానీ రోజువారీగా అయ్యే ఈ చిన్న మొత్తాలే దీర్ఘకాలంలో రూ.వేలు అవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ అనవసరపు ఖర్చులను ఆపి దాన్ని క్రమబద్ధంగా ఇన్వెస్ట్ చేస్తే రిటైర్మెంట్ నాటికి చేతిలో భారీ నిధి ఉంటుంది.

**'షోఆఫ్' వద్దు**

సమాజంలో మన హోదాను చూపించుకోవడం కోసం ఖరీదైన డిజైనర్ దుస్తులు, లగ్జరీ కార్లు లేదా ఎప్పటికప్పుడు కొత్త గ్యాడ్జెట్లు కొనడం వల్ల తాత్కాలిక ఆనందం మాత్రమే దక్కుతుంది. ఇది దీర్ఘకాలంలో మన సంపదను హరించేస్తుంది. నిజమైన ధనవంతులు ఎప్పుడూ ఇతరులను ఇంప్రెస్ చేయడానికి కాకుండా, ఆ వస్తువు వల్ల తమకు వచ్చే ఉపయోగం ఏంటో చూసి మాత్రమే కొనుగోలు చేస్తారు.

## షమీ నుంచి ధోనీ వరకు, ఇప్పుడు హెడ్‌కు.. ఆటగాళ్ల కుటుంబాలకు తప్పని వేధింపులు




ఒకప్పుడు పెద్ద మనుషుల ఆటగా (జెంటిల్మన్ గేమ్) పేరు పొందిన క్రికెట్, సోషల్ మీడియా యుగంలో తన స్వరూపాన్ని మార్చుకుంటోంది. అభిమానం హద్దులు దాటి, ఆన్‌లైన్ మూక ఉన్మాదంగా పరిణమిస్తోంది. ఈ విష సంస్కృతికి ఎక్కువగా బలవుతోంది ఆటగాళ్లు కాదు, వారి కుటుంబసభ్యులే కావడం అత్యంత ఆందోళనకరమైన విషయం. గత దశాబ్ద కాలంలో మతపరమైన దూషణలు, రేప్ బెదిరింపులు, నిరంతర ట్రోలింగ్ వంటి ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. ఇవి ఆధునిక క్రికెట్ అభిమానంలో దాగి ఉన్న చీకటి కోణాన్ని ప్రపంచానికి చూపిస్తున్నాయి. మైదానంలో ఆటగాళ్ల మధ్య వైరం లేదా జట్టు ఓటమిని తట్టుకోలేని కొందరు అభిమానులు, తమ కక్షను వారి కుటుంబసభ్యులపై తీర్చుకుంటున్నారు. ఇండియా నుంచి ఆస్ట్రేలియా వరకు ఎందరో ప్రముఖ క్రికెటర్లు, వారి ప్రియమైన వారు ఈ ఆన్‌లైన్ వేధింపుల వల్ల తీవ్ర మానసిక క్షోభను అనుభవించారు. ఆటగాళ్ల వెనుక కూడా ఓ కుటుంబం ఉంటుందనే నిజాన్ని గుర్తుంచుకోవాలని, వైరాన్ని మైదానానికే పరిమితం చేయాలని వారు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తున్న అలాంటి కొన్ని దారుణమైన ఘటనలను పరిశీలిద్దాం.

**1. ట్రావిస్ హెడ్ భార్య పై వేధింపులు (2026)**

ఇటీవల ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగిన మ్యాచ్‌లో ట్రావిస్ హెడ్, విరాట్ కోహ్లీ మధ్య చోటుచేసుకున్న స్వల్ప వాగ్వాదం.. మైదానం దాటి పెను దుమారం రేపింది. ఈ ఘటన తర్వాత ట్రావిస్ హెడ్ భార్య జెస్సికా ఆన్‌లైన్‌లో తీవ్ర వేధింపులకు గురయ్యారు. మ్యాచ్ అనంతరం షేక్‌హ్యాండ్ ఇచ్చేందుకు హెడ్ ప్రయత్నించగా, కోహ్లీ స్పందించకుండా ముందుకు వెళ్ళిపోయారు. ఈ వీడియో వైరల్ కావడంతో, కొందరు జెస్సికాతో పాటు ఆమె కుటుంబసభ్యులు, స్నేహితులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో దూషణలకు దిగారు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్, టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా గెలిచినప్పుడు కూడా ఇలాంటి వేధింపులే ఎదుర్కొన్నామని జెస్సికా ఆవేదన వ్యక్తం చేశారు. "ఆటలో ఆవేశం సహజం. కానీ, ఆట వెనుక నిజమైన మనుషులు, వారి కుటుంబాలు ఉంటాయని గుర్తుంచుకోవాలి" అని ఆమె హితవు పలికారు.

**2. మహ్మద్ షమీ పై మతపరమైన దాడి (2021)**

2021 టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ చేతిలో భారత్ 10 వికెట్ల తేడాతో ఓటమి పాలవ్వడం, భారత క్రికెటర్ మహ్మద్ షమీ పాలిట శాపంగా మారింది. ఆ మ్యాచ్‌లో షమీ ప్రదర్శన బాగోలేదంటూ మొదలైన విమర్శలు, అనూహ్యంగా మతపరమైన దాడికి దారితీశాయి. జట్టులో ఉన్న ఏకైక ముస్లిం ఆటగాడు కావడంతో, కొందరు ట్రోలర్లు అతన్ని "దేశద్రోహి"గా చిత్రీకరించి, ఉద్దేశపూర్వకంగానే ఓటమికి కారణమయ్యాడంటూ ఇస్లామోఫోబిక్ వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన అప్పటి కెప్టెన్ విరాట్ కోహ్లీ.. "మేం మైదానంలో ఆడుతున్నాం, సోషల్ మీడియాలో దాక్కున్న వెన్నెముక లేని వాళ్లలా కాదు. ఒకరి మతాన్ని అడ్డుపెట్టుకుని దాడి చేయడం మానవమాత్రుడు చేయగల అత్యంత నీచమైన పని" అని దుయ్యబట్టారు.

**3. కోహ్లీ కుమార్తె వామికాకు రేప్ బెదిరింపులు (2021)**

2021 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు వైఫల్యం తర్వాత విరాట్ కోహ్లీ కెప్టెన్సీపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఆయన భార్య అనుష్క శర్మపై ఎప్పటిలాగే ట్రోలింగ్ జరిగింది. అయితే, ఈసారి కొందరు నీచులు అన్ని హద్దులు చెరిపేశారు. వారి పసికందు కుమార్తె వామికాకు రేప్ బెదిరింపులు ఇస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఇది భారత క్రీడా ప్రపంచంలోనే అత్యంత చీకటి అధ్యాయాలలో ఒకటిగా నిలిచిపోయింది. ఈ బెదిరింపులకు సంబంధించి ముంబై సైబర్ పోలీసులు హైదరాబాద్‌కు చెందిన 23 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను అరెస్టు చేశారు.

**4. ధోనీ కుమార్తె జివాకు బెదిరింపులు (2020)**

2020 ఐపీఎల్ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రదర్శన పేలవంగా ఉన్న సమయంలో, ఎంఎస్ ధోనీ కుటుంబం ఇలాంటి భయానక అనుభవాన్నే ఎదుర్కొంది. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సీఎస్కే ఓటమి తర్వాత, ధోనీ ఐదేళ్ల కుమార్తె జివాకు సోషల్ మీడియాలో రేప్ బెదిరింపులు వచ్చాయి. ధోనీ, అతని భార్య సాక్షి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో ఈ బెదిరింపులు కనిపించడంతో దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పోలీసులు దర్యాప్తు చేసి, గుజరాత్‌లోని కచ్ జిల్లాకు చెందిన 16 ఏళ్ల విద్యార్థి ఈ బెదిరింపులకు పాల్పడినట్లు గుర్తించారు. పసిపిల్లలను లక్ష్యంగా చేసుకోవడం ఆన్‌లైన్ అభిమానంలో నీచమైన స్థాయికి నిదర్శనంగా మారింది.

# స్పోర్ట్స్

## రికార్డులు బద్దలుకొట్టినా.. ఆటోలోనే ప్రయాణం.. భారత పోల్ వాల్టర్ల దుస్థితి పై దుమారం




ఫెడరేషన్ కప్ 2026లో భారత పోల్ వాల్ట్ అథ్లెట్లు దేవ్ కుమార్ మీనా, కుల్దీప్ కుమార్ కొత్త చరిత్ర సృష్టించారు. జాతీయ రికార్డును బద్దలుకొట్టి సత్తా చాటారు. అయితే, ఒకవైపు వారి ప్రతిభకు ప్రశంసలు దక్కుతుండగా, మరోవైపు వారు తమ క్రీడా పరికరాలను ఓ చిన్న ఈ-రిక్షాలో ఇబ్బంది పడుతూ తీసుకెళుతున్న వీడియో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగింది. సోమవారం రాంచీలో జరిగిన పురుషుల పోల్ వాల్ట్ ఫైనల్‌లో మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ ఇద్దరు అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేశారు. తొలుత కుల్దీప్ పేరిట ఉన్న 5.41 మీటర్ల రికార్డును దేవ్ 5.42 మీటర్లతో బద్దలుకొట్టాడు. వెంటనే పుంజుకున్న కుల్దీప్ 5.45 మీటర్లు క్లియర్ చేసి తిరిగి రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే, దేవ్ కూడా అదే 5.45 మీటర్ల మార్కును అందుకోవడంతో 'కౌంట్‌బ్యాక్' పద్ధతిలో అతనికి స్వర్ణం, కుల్దీప్‌కు రజతం లభించాయి. ఈ ప్రదర్శనతో ఇద్దరూ 2026 కామన్వెల్త్ గేమ్స్‌కు (అర్హత మార్కు 5.25 మీటర్లు) సులభంగా అర్హత సాధించారు. ఈ ఘనత సాధించిన కొన్ని గంటలకే, ఈ ఇద్దరు అథ్లెట్లు తమ 5 మీటర్ల పొడవైన, సున్నితమైన ఫైబర్‌గ్లాస్ పోల్స్‌ను ఓ చిన్న ఈ-రిక్షా వెనుక భాగంలో పెట్టుకుని వీధుల్లో ప్రయాణిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. జాతీయ రికార్డు సృష్టించిన క్రీడాకారులకు కనీస రవాణా సౌకర్యం కల్పించకపోవడంపై క్రీడాభిమానులు, నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్ కాకుండా ఇతర క్రీడల్లో అథ్లెట్లకు అందుతున్న మద్దతు ఎంత దయనీయంగా ఉందో ఈ సంఘటన అద్దం పడుతోందని విమర్శలు వెల్లువెత్తాయి. వీరికి ఇలాంటి ఇబ్బందులు ఎదురవ్వడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది ఆరంభంలోనే, తమ పోల్స్ కారణంగా పన్వేల్ స్టేషన్‌లో ఓ టీటీఈ వీరిని రైలు నుంచి దింపేయడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చిందని గతంలో వార్తలు వచ్చాయి.

హంస కలం వార్త
మంగళవారం 26 మే 2026

# పర్సంటేజ్ కోసం పట్టు.. థియేటర్ల వివాదం పై రంగంలోకి చిరంజీవి.. 'పెద్ది' విడుదల పై ఉత్కంఠ!

- నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య ముదిరిన పర్సంటేజ్ వివాదం
- సమస్య పరిష్కారానికి రంగంలోకి దిగిన మెగాస్టార్ చిరంజీవి
- రామ్ చరణ్ 'పెద్ది' చిత్రం విడుదలపై నెలకొన్న ఉత్కంఠ
- శ్లాబ్ విధానం అమలు చేయకుంటే ప్రదర్శన నిలిపివేస్తామన్న ఎగ్జిబిటర్లు
- చిరంజీవి నివాసంలో ఎగ్జిబిటర్లతో నేడు కీలక సమావేశం



తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నిర్మాతలు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానుల (ఎగ్జిబిటర్లు) మధ్య గత కొన్ని రోజులుగా నలుగుతున్న 'పర్సంటేజ్ సిస్టమ్' వివాదం క్లైమాక్స్ దశకు చేరుకుంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించి, పరిశ్రమకు మేలు చేసేందుకు మెగాస్టార్ చిరంజీవి స్వయంగా రంగంలోకి దిగారు. తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఈ రోజు సాయంత్రం 4 గంటలకు చిరంజీవి నివాసంలో ఆయనతో ప్రత్యేకంగా సమావేశం కానుండటంతో ఫిలింనగర్‌లో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**ఏమిటీ వివాదం?**

ప్రస్తుతం మల్టీప్లెక్స్‌లలో సినిమా కలెక్షన్ల ఆధారంగా నిర్మాతలు, థియేటర్ల యజమానులు వాటాలు (పర్సంటేజ్) పంచుకుంటున్నారు. కానీ, సింగిల్ స్క్రీన్లకు మాత్రం సినిమా ఫలితంతో సంబంధం లేకుండా పాత పద్ధతిలోనే అద్దె (ఫిక్స్‌డ్ రెంటల్) చెల్లిస్తున్నారు. దీనిపై ఎగ్జిబిటర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఓటీటీల ప్రభావం, భారీగా పెరిగిన కరెంట్ బిల్లులు, థియేటర్ల నిర్వహణ ఖర్చులతో సింగిల్ స్క్రీన్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సినిమా ఆడకపోయినా లక్షల్లో అద్దెలు కట్టలేక అప్పుల పాలవుతున్నామని, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లే తమకు కూడా రెవెన్యూ షేరింగ్ విధానం అమలు చేయాలని వారు గట్టిగా పట్టుబడుతున్నారు.

**'పెద్ది' విడుదల పై ప్రభావం**

ఈ వివాదం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలపై తీవ్ర ప్రభావం చూపేలా ఉంది. జూన్ 4న భారీ ఎత్తున రిలీజ్ కానున్న ఈ సినిమా నుంచే పర్సంటేజ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, లేనిపక్షంలో థియేటర్లలో సినిమాను ప్రదర్శించేది లేదని తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం హెచ్చరించింది. గతంలో నిర్మాత దిల్ రాజు నేతృత్వంలో జరిగిన చర్చలు ఫలించకపోవడంతో వారు తమ నిర్ణయానికే కట్టుబడి ఉన్నారు. దీనికి తోడు, టికెట్ ధరల పెంపును కూడా వారు వ్యతిరేకిస్తున్నారు. అధిక రేట్లు పెడితే సామాన్య ప్రేక్షకులు థియేటర్లకు దూరమవుతారని, ఈ విషయంపై ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా లేఖ రాశామని వారు చెబుతున్నారు.

**చిరంజీవి చొరవతో పరిష్కారం దొరికేనా?**

పరిశ్రమలో ఎలాంటి సమస్య తలెత్తినా పెద్దన్న పాత్ర పోషించే చిరంజీవి, ఈసారి తన కుమారుడి సినిమా విడుదల ఇరకాటంలో పడటం, అదే సమయంలో వందలాది థియేటర్ల యజమానుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ సమస్య పరిష్కారానికి నడుం బిగించారు. నిర్మాతల మండలి, ప్రొడ్యూసర్స్ గిల్డ్‌తో చర్చించి, ఇటు నిర్మాతలకు నష్టం జరగకుండా, అటు ఎగ్జిబిటర్లకు న్యాయం జరిగేలా ఒక మధ్యేమార్గం కనుగొంటారని ఇండస్ట్రీ వర్గాలు ఆశిస్తున్నాయి. ఈ మెగా భేటీ తర్వాతైనా ఈ వివాదానికి తెరపడి, 'పెద్ది' సినిమా విడుదలకు మార్గం సుగమం అవుతుందో లేదో వేచి చూడాలి.

## ఓటీటీలో మరాఠీ మిస్టరీ థ్రిల్లర్!



మరాఠీలో రూపొందిన ఒక మిస్టరీ థ్రిల్లర్ ఇప్పుడు ఓటీటీకి వచ్చేసింది. ఆ సినిమా పేరే 'సల్బర్డి'. పూజ సావంత్ ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమాకి, రమేశ్ చౌదరి దర్శకత్వం వహించాడు. రామ్ జాదవ్ - గజానన్ జాదవ్ నిర్మించిన ఈ సినిమాను, ఏప్రిల్ 17వ తేదీన థియేటర్లలో విడుదల చేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఈ సినిమాను 'అమెజాన్ ప్రైమ్' లో స్ట్రీమింగ్‌కి తీసుకుని వచ్చారు. అయితే మరాఠీలో మాత్రమే అందుబాటులో ఉంది. అది ఆధునిక ప్రపంచానికి చాలా దూరంగా ఉండే ఒక మారుమూల గ్రామం. ఆ గ్రామానికి చెందిన పదేళ్ల పిల్లలు అదృశ్యమవుతూ ఉంటారు. అలా కనిపించకుండా పోయిన పిల్లలు, ఆ తరువాత శవాలుగా దొరుకుతూ ఉంటారు. దాంతో చీకటిపడితే తమ పిల్లలను బయటికి పంపించడానికి తల్లిదండ్రులు భయపడుతూ ఉంటారు. అందరూ కూడా భయంతో బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో ఈ కేసును పరిష్కరించడం కోసం స్పెషల్ పోలీస్ ఆఫీసర్ గా 'మనోరమ' అక్కడికి వస్తుంది. తనదైన స్టైల్లో అన్ని కోణాలలో సమస్య మూలలను పరిశీలిస్తూ ముందుకు వెళుతుంది. అప్పుడు ఆమెకి తెలిసే నిజాలేమిటి? పిల్లల మరణాలకు కారకులు ఎవరు? వాళ్లు అలా చేయడంలోని ఉద్దేశం ఏమిటి? అనేది కథ.

## ఓటీటీ ఆడియన్స్ ను కట్టిపడేస్తున్న కన్నడ క్రైమ్ థ్రిల్లర్!




ఈ మధ్య కాలంలో ఇటు పురాణాలతో అటు సైన్స్ తో ముడిపడిన కథలకు విపరీతమైన ఆదరణ లభిస్తోంది. అలాగే క్రైమ్ థ్రిల్లర్ కథలకు కూడా మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో ఈ మూడు అంశాలను కలుపుకుని ఒక కన్నడ సినిమా రూపొందింది. ఆ సినిమా పేరే 'హయగ్రీవ'. ధనిర్వ కథానాయకుడిగా నటించిన ఈ సినిమా, ఫిబ్రవరి 27వ తేదీన థియేటర్లకు వచ్చింది. మిక్స్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, ఈ నెల 22వ తేదీ నుంచి అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ అవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా కన్నడలో మాత్రమే అందుబాటులో ఉంది. అయినా ఈ కంటెంట్ దూసుకు పోతుండటం విశేషం. శ్రీమహావిష్ణువు గుర్రం తలను ధరించి హయగ్రీవుడిగా మారడం వంటి సన్నివేశాలతో ఈ కథ మొదలై, ఆ తరువాత ప్రస్తుత కాలంలో కొనసాగుతుంది. ఈ రెండు కాలాలకు ఈ కథను ముడిపెట్టిన తీరు ఆసక్తికరంగా అనిపిస్తుంది. సంజనా ఆనంద్ .. సాధు కోకిల .. రంగాయన రఘు .. శరత్ లోహితస్య ఇతర ముఖ్యమైన పాత్రలను పోషించారు. అర్జున్ హయగ్రీవ ఒక పోలీస్ ఆఫీసర్ గా పనిచేస్తుంటాడు. అదే సమయంలో నగరంలో వరుస హత్యలు జరుగుతూ వెళుతుంటాయి. హంతకుడిని వెతుకుతూ ఉండగానే, మరికొన్ని హత్యలు జరుగుతుంటాయి. హంతకుడు హత్యలు చేసే విధానంపై అధ్యయనం చేసిన అర్జున్ హయగ్రీవకి ఒక నిజం తెలుస్తుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? దాని పర్యవసాలు ఎలా ఉంటాయి? అనేది కథ. విజువల్స్ .. నేపథ్య సంగీతం ఈ సినిమాకి హైలైట్ గా నిలుస్తాయని అంటున్నారు. తెలుగు ఆడియో కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# నా శరీరంలో మార్పులు చూసి.. ప్లాస్టిక్ సర్జరీ అనుకున్నారు



- అవికా ప్లాస్టిక్ సర్జరీలు, కాస్మోటిక్ ట్రీట్‌మెంట్లు చేయించుకుందని ప్రచారం
- మొటిమలు తగ్గించుకోవడానికి చిన్న ట్రీట్‌మెంట్ చేయించుకున్నానన్న అవికా
- అమ్మాయిలు పెరిగే కొద్దీ శరీరంలో మార్పులు సహజంగా వస్తాయని వ్యాఖ్య

ఇటీవలే 'అగ్లీ స్టోరీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కథానాయిక అవికా గోర్ ప్లాస్టిక్ సర్జరీలు, కాస్మోటిక్ ట్రీట్‌మెంట్లు చేయించుకుందంటూ సోషల్ మీడియాలో గాసిప్స్ వినిపిస్తున్నాయి. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ రూమర్లపై ఆమె స్పందిస్తూ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. తమ పై వస్తున్న సర్జరీ వదంతులను అవికా పూర్తిగా తోసిపుచ్చింది. "నేను ముఖంపై ఒక చిన్న ట్రీట్‌మెంట్ తీసుకున్న మాట వాస్తవమే. కానీ, అది అందం కోసం చేయించుకున్న సర్జరీ కాదు.. కేవలం నా ముఖంపై ఉన్న పింపుల్స్ (మొటిమలు) తగ్గించుకోవడానికి మాత్రమే. దురదృష్టవశాత్తూ అది కూడా సరిగా పనిచేయలేదు" అని వెల్లడించింది. నటిగా స్క్రీన్‌పై ప్రెజెంటబుల్‌గా కనిపించడం ముఖ్యం కాబట్టి, అవసరాన్ని బట్టి అప్పుడప్పుడు పార్లర్‌కు వెళ్లి బ్లడ్ సెల్స్ క్లీనింగ్, బైఫిషియల్ లాంటి సాధారణ ఫేషియల్స్ చేయించుకునేదాన్ని తప్ప ఎలాంటి కాస్మోటిక్ సర్జరీలు చేయించుకోలేదని స్పష్టం చేసింది. "నాకు 7 ఏళ్ల వయసున్నప్పటి నుండే మేకప్ వేసుకోవడం అలవాటైంది. నా చర్మాన్ని కాపాడుకోవడానికి సన్‌స్క్రీన్ ఎక్కువగా వాడతాను. అసలు ఒక చిన్న టాటూ వేయించుకోవాలన్నా, కనీసం హెయిర్ కట్ చేయించుకోవాలన్నా మా అమ్మ పర్మిషన్ కావాలి.. అలాంటిది అంత పెద్ద సర్జరీలు నేను ఎలా చేయించుకోగలను?" అని అవికా ఎదురు ప్రశ్నించింది. శరీరంలో వచ్చిన మార్పులు, ఫిట్‌నెస్ గురించి మాట్లాడుతూ.. "నా శరీరతత్వం ఏంటంటే.. చాలా త్వరగా బరువు పెరుగుతాను. అంతే వేగంగా బరువు తగ్గుతాను. వయసు పెరిగే కొద్దీ అమ్మాయిల శరీరంలో సహజంగానే మార్పులు వస్తాయి. కానీ, నన్ను చిన్నప్పటి నుండి చూస్తున్న జనాలు ఆ మార్పులను గమనించి ప్లాస్టిక్ సర్జరీ అనుకుని పొరబడ్డారు" అని చెప్పింది. ఇండస్ట్రీలో సమంత, రష్మిక మందన్నా, పూజా హెగ్డే వంటి స్టార్ హీరోయిన్లు తమ బాడీని ఎంత పర్‌ఫెక్ట్‌గా మెయింటైన్ చేస్తారో చూసి తాను ఎంతో ఇన్‌స్పైర్ అయ్యానని, వారిలాగే తాను కూడా జిమ్‌లో కఠినమైన వర్కవుట్స్ చేస్తూ సహజంగానే బరువు తగ్గానని అవికా గోర్ క్లారిటీ ఇచ్చింది.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449